ఇద్దరికి నామినేటెడ్ పదవులు!

మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య, భాజపా జిల్లా అధ్యక్షుడు శశిభూషణ్‌రెడ్డికి అవకాశం

ప్రొద్దుటూరు వైద్యం, చిన్నచౌకు (కడప), న్యూస్‌టుడే: జిల్లాకు చెందిన ఇద్దరు నేతలకు నామినేటెడ్ పదవుల్లో చోటు దక్కింది. తెదేపా, భాజపా నుంచి ఒక్కొక్కరికి స్థానం లభించింది. అర్బన్ ఫైనాన్స్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సభ్యుడిగా ప్రొద్దుటూరుకు చెందిన మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్యను ప్రభుత్వం నియమించింది. సార్వత్రిక ఎన్నికల్లో తెదేపా అభ్యర్థి వరదరాజులరెడ్డి గెలుపునకు పుల్లయ్య కృషి చేశారు. పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నారు. ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడిని కలిసిన ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి బచ్చల పుల్లయ్య, ముక్తియార్‌కు నామినేటెడ్ పదవులు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు తొలి జాబితాలో పుల్లయ్యకు అవకాశం దక్కింది. తనపై నమ్మకంతో బాధ్యతను అప్పగించినందుకు పార్టీ అధిష్ఠానానికి పుల్లయ్య కృతజ్ఞతలు తెలిపారు. ◆ భాజపా జిల్లా అధ్యక్షుడు శశిభూషణ్‌రెడ్డిని మార్క్‌ఫెడ్ డైరెక్టర్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఇప్పటివరకు రెండు సార్లు భాజపా జిల్లా అధ్యక్షుడిగా పని చేయగా, మూడోసారి కొనసాగుతున్నారు. భాజపా తరఫున కొద్దిమందికి అవకాశం రాగా.. తొలి జాబితాలోనే ఆయన స్థానం దక్కించుకున్నారు. మార్క్‌ఫెడ్ అంటేనే వివిధ రకాల విత్తనాలకు సంబంధించిన విభాగమని, కల్తీ అనే మాట లేకుండా కష్టాన్ని నమ్ముకున్న రైతన్నకు న్యాయం చేస్తానని, వారికి లాభాలు వచ్చే దిశగా తన వంతు కృషి చేస్తానని శశిభూషణ్‌రెడ్డి తెలిపారు.


బచ్చల పుల్లయ్య, వంగల శశిభూషణ్‌రెడ్డి

సిట్ బృందంలో ఎస్పీ హర్షవర్ధన్‌రాజుకు స్థానం



ఈనాడు, కడప: తిరుమల లడ్డూ ప్రసాదంలో కల్తీ నెయ్యి వినియోగంపై విచారణకు రాష్ట్ర ప్రభుత్వం నియమించిన సిట్ బృందంలో ఎస్పీ హర్షవర్ధన్ రాజు ఉండనున్నారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం మంగళ వారం ఉత్తర్వులు జారీ చేసింది. సిట్ చీఫ్‌గా ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి ఉండనుండగా, సభ్యులుగా డీఐజీ గోపీనాథ్‌జెట్టి, ఎస్పీ స్థాయిలో హర్షవర్ధన్‌రాజు ఉండనున్నారు. డీఐజీ గతంలో తితిదే సీవీఎస్‌వోగా పని చేయగా, ఎస్పీ జిల్లాకు రాక ముందు తిరుపతి జిల్లాలో పనిచేశారు. హర్షవర్ధన్‌రాజుకు మంచి ప్రతిభ గల అధికారిగా పేరుంది. ఎస్పీగా బాధ్యతలు నిర్వహిస్తూనే సిట్ విచారణలో పాల్గొననున్నారు.

మాటల్లో అభిమానం... చేతల్లో అపకారం!

– ఈనాడు, కడప

నా ఎస్సీ... నా ఎస్టీ అంటూ గత వైకాపా ప్రభుత్వంలో అప్పటి సీఎం జగన్ తీసిన రాగం వెనుక ఆ సామాజికవర్గాల ఎదుగుదలను దెబ్బతీసే దురాలోచన దాగి ఉందని కేంద్ర సామాజిక న్యాయం, సాధికారశాఖ నివేదికతో మరోసారి స్పష్టమైంది. వైకాపా అధినేత జగన్ అయిదేళ్ల ఏలుబడిలో జరిగిన దమనకాండపై నివేదిక వెల్లడించింది. రాష్ట్రంలోనే ఉమ్మడి కడప జిల్లా అగ్రస్థానంలో నిలవడం ఆందోళన కలిగిస్తోంది. గత వైకాపా పాలనలో జిల్లా చరిత్రలో ఎన్నడూ లేనంతగా ఎస్సీ, ఎస్టీలపై దాడులు, హత్యలు, అత్యాచారాలు పెరిగిపోయాయి. ఇందుకు నిలువెత్తు సాక్ష్యమే కేంద్రం వెల్లడించిన తాజా నివేదిక. ఇందుకు సంబంధించిన వివరాలిలా..

◆ తనను తాను దళిత, గిరిజన బాంధవుడిగా అభివర్ణించుకున్న జగన్ తన పాలనలో అణగారినవర్గాలపై తరచూ దారుణమైన దమనకాండ కొనసాగింది. 'నా ఎస్సీ, నా ఎస్టీ, నా బీసీ, నా మైనార్టీ' అంటూ దళిత, ముస్లిం వర్గాల దీనజనోద్ధారకుడిలా ఊదరగొట్టగా.. ఆయన హయాంలో ఆయా వర్గాల బాధితుల సంఖ్య భారీగా ఉండడం గమనార్హం. బాధితులకు పోలీస్‌స్టేషన్‌లో న్యాయం జరగకపోగా, అక్కడా వారే తప్పుడు కేసులు సైతం ఎదుర్కోవాల్సి వచ్చింది. రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత ఎస్సీ సామాజికవర్గానికి చెందిన వ్యక్తి అయినప్పటికీ... గతంలో పులివెందుల ప్రాంతంలో దళితురాలు హత్య జరగ్గా.. ఆమె కుటుంబాన్ని పరామర్శించడానికి రాగా, అప్పట్లో ఆమెపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయడం విశేషం. ఇప్పటికీ ఆ కేసు కడప కోర్టులో నడుస్తోంది.

వైకాపా హయాంలో ఎస్సీ, ఎస్టీలపై వేధింపులు

రాష్ట్రంలో అగ్రస్థానంలో ఉమ్మడి కడప జిల్లా

కేంద్ర సామాజిక న్యాయ, సాధికారశాఖ వెల్లడి



దళిత ఎమ్మెల్యే నియోజకవర్గంలోనే...

బద్వేలు నియోజకవర్గానికి దళిత ఎమ్మెల్యే డాక్టర్ సుధ ప్రాతినిధ్యం వహిస్తున్నారు.. ఆ సామాజిక వర్గానికిచెందిన జయన్నపై వైకాపా నేతలు విచక్షణారహితంగా గతంలో దాడి చేశారు. పొలంలో సాగునీటి పైపులైన్లు అమర్చుకునే విషయంలో చోటు చేసుకున్న వివాదం దాడికి దారితీసింది. అట్లూరు మండలం దిన్నెమీదపల్లెకు చెందిన జయన్నకు గ్రామ సమీపంలో పొలాలున్నాయి. పంటకు నీటిని పారించడానికి ఏర్పాటు చేసిన పైపులను పక్కనున్న మజ్జూవారిపల్లెకు చెందిన వైకాపా నేతలు వాడుకుంటున్నారు. పైపులు వాడుకోవడాన్ని జయన్న ఆక్షేపించడంతో వైకాపా నేతలు జీర్ణించుకోలేక దాడికి పాల్పడ్డారు.

బాధితులపైనే కేసుల నమోదు

రాజంపేట మండలం కొమ్మివారిపల్లి ఎన్టీఆర్ కాలనీలో భూఆక్రమణలపై రెవెన్యూఅధికారులకు ఫిర్యాదు చేశారన్న కక్షతో వైకాపా నేత, ఆయన అనుచరులు ఎస్సీ వర్గానికి 10 మందిపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. కాలనీలో 47 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. తెదేపా ప్రభుత్వ హయాంలో 16 మంది ఎస్సీలకు నివాస పట్టాలిచ్చారు. వైకాపా అధికారంలోకి వచ్చాక.. ఆ భూమిపై ఉమ్మడి కడప జిల్లా ప్రజాప్రతినిధి ముఖ్య అనుచరుడి కన్నుపడింది. స్థలం ఆక్రమించి అందులో నివాసాలు నిర్మించి ఇతరులకు అమ్మేశారు. ఈ విషయమై అదే గ్రామంలోని ఎస్సీలు పలువురు అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో అక్రమానికి పాల్పడిన వ్యక్తికి నోటీసులిచ్చారు. ఈ నేపథ్యంలో గ్రామ వైకాపా నేతలు మాపైనే ఫిర్యాదు చేస్తారా?.. అంటూ కర్రలు, ఇనుప రాడ్లతో ఎస్సీలపై విచక్షణారహితంగా దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు.

కడపలో దళిత అధికారి హత్య

కడప పశువైద్యశాల డీడీ అచ్చెన్న హత్యకు గురయ్యారు. కడప నగర నడిబొడ్డు నుంచి అపహరించి హత్య చేసి గువ్వలచెరువు కనుమ రహదారి పక్కన పడేశారు. వారం రోజుల అనంతరం పశువుల కాపర్లు గుర్తించి సమాచారమివ్వడంతో నేరం వెలుగు చూసింది. అంతకుముందు కుటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేసినా సకాలంలో స్పందించకపోవడంతో నేరం జరిగింది. హత్య కేసు రాష్ట్రంలో సంచలనం కలిగించింది.

భూదందాలూ నేరాలకు కారణం

ఉమ్మడి కడప జిల్లాలో సాగిన భూదందాలు నేరాలు పెరగడానికి కారణమయ్యాయి. ఎస్సీ, ఎస్టీల భూముల ఆక్రమణకు వారిపై వేధింపులు అధికమయ్యాయి. కాశినాయన మండలం సావిశెట్టిపల్లెలో ఎస్సీల భూములను ఆక్రమించారు. సుమారు 40 కుటుంబాలకు చెందిన 63 ఎకరాల భూమిని కాజేశారు. సీకే దిన్నె మండలం మద్దిమడుగు సుగాలిబిడికి గ్రామానికి చెందిన రాజానాయక్ 5.14 ఎకరాల భూమిని వైకాపా హయాంలో చక్రం తిప్పిన కీలక నేత కాజేశారు. ఇలాంటివి ఎన్నెన్నో ఘటనలు చోటుచేసుకున్నాయి.

జగన్ ఇలాకాలోనూ దారుణం

సీఎం జగన్ ప్రాతినిధ్యం వహిస్తున్న పులివెందుల నియోజకవర్గంలోని సింహాద్రిపురం మండలం అంకాలమ్మగూడూరుకు చెందిన దళితుడు కృష్ణయ్య దారుణ హత్యకు గురయ్యారు. బొగ్గుల బట్టీ విషయమై తలెత్తిన వివాదం హత్యకు దారితీసింది. అంతకు ముందు కృష్ణయ్య కుటుంబాన్ని గ్రామ బహిష్కరణ చేశారు. కలెక్టర్, ఎస్పీలకు ఫిర్యాదు అనంతరం తీసుకున్న చర్యలతో పోలీసు రక్షణలో గ్రామానికి రాగా, నెల రోజులకే హత్యకు గురయ్యారు. వైకాపా సానుభూతిపరులే హత్యకు పాల్పడినట్లు బాధితులు ఆరోపిస్తున్నారు.

శిలాఫలకంలో పేరు కోసమా... బదిలీ రద్దు కోసమా?

జడ్పీ వాణిజ్య సముదాయం ప్రారంభోత్సవం నేడు

– న్యూస్‌టుడే, కడప ఏడురోడ్లు


ప్రారంభోత్సవానికి సిద్ధమైన జడ్పీ వాణిజ్య సముదాయం

వివాదాలకు నిలయంగా నిలిచిన కడప నడిబొడ్డున నిర్మించిన జిల్లాపరిషత్తు వాణిజ్య సముదాయాన్ని బుధవారం ప్రారంభించనున్నారు. జడ్పీ సీఈవో సుధాకర్‌రెడ్డికి పుట్టపర్తి డీఎల్‌డీవోగా బదిలీ కావడంతో ఆగమేఘాల మీద ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు చేశారు. సోమవారం రాత్రి వరకు భవనాన్ని ఎప్పుడు ప్రారంభించేదీ కనీసం ఉద్యోగులకు కూడా తెలియదు. బదిలీలు కాకమునుపు ఎప్పుడూ ప్రారంభిస్తారో చెప్పలేని పరిస్థితి ఉండేది. అలాంటిదీ జడ్పీ సీఈవోకు బదిలీ ఉత్తర్వులు రావడంతో ఆగమేఘాల మీద ప్రారంభోత్సవానికి సన్నాహాలు చేయడం గమనార్హం.

బదిలీ నిలుపుకోవడం కోసమేనా...: జడ్పీ సీఈవో సుధాకర్‌రెడ్డి తన బదిలీని నిలుపుకోవడం కోసం ముమ్మరంగా ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది. బదిలీపై జడ్పీ సీఈవోగా రావాల్సిన ఓబులమ్మ ఇక్కడకు వచ్చేందుకు సుముఖత లేదని ప్రచారం. ఈ నేపథ్యంలో ప్రస్తుతం జడ్పీ సీఈవోగా ఉన్న సుధాకర్‌రెడ్డి వీలైనంత వరకు అధికార పార్టీకి చెందిన ఎమ్మెల్యేలను, ప్రజాప్రతినిధులను కలిసినట్లు ప్రచారం. వాణిజ్య సముదాయం ప్రారంభోత్సవం పేరుతో వారితో చెప్పి తన బదిలీని నిలుపుకోవాలని ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. ఇదిలా ఉంటే 16 నెలలపాటు సముదాయాన్ని జడ్పీ సీఈవో పర్యవేక్షణలో నిర్మాణం జరిగిందని, శిలాఫలకంలో తన పేరు ఉండేలా జడ్పీ సీఈవో వెంటనే ప్రారంభిస్తున్నారని మరో ప్రచారం సాగుతోంది.

రూ.4.14 కోట్లతో నిర్మాణం: గతేడాది జూన్‌లో జడ్పీ వాణిజ్య సముదాయానికి సంబంధించి అప్పటి ఉపముఖ్యమంత్రి అంజాద్‌బాషా, జడ్పీ ఛైర్మన్ ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. ఎస్‌వీఎస్ఎస్ కన్‌స్ట్రక్షన్స్ వారికి పనులు అప్పగించారు. తొలుత రూ.1.5 కోట్లతో నిర్మించాలనుకున్నారు. అంచనా వ్యయం పెరిగి రూ.4.14 కోట్ల వ్యయమైంది. ఒక్కో ఫ్లోర్‌కు 12 గదుల చొప్పున మొత్తం 3 ఫ్లోర్లలో 36 గదులు నిర్మించారు.

నిర్మాణం దశలోనే..: వాణిజ్య సముదాయం నిర్మాణ దశలోనే బీరం శ్రీధర్‌రెడ్డి విద్యాసంస్థలకు మొదటి, రెండో అంతస్తులను జడ్పీ సీఈవో కేటాయించడంతో అప్పట్లో విమర్శలు చెలరేగాయి. సీపీఐ నాయకులు ధర్నాలు సైతం చేపట్టారు. టెండర్లు లేకుండా ఎలా మొదటి, రెండో అంతస్తులను విద్యాసంస్థలకు కేటాయిస్తారని ప్రశ్నించారు. గత వైకాపా నేతల అండదండలు పుష్కలంగా ఉండడంతో జడ్పీ సీఈవో ఇవేమీ పట్టించుకోలేదు. అప్పట్లో ఆయన ఇష్టానుసారంగా వ్యవహరించారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఆయన వైకాపా నేతలకు దూరంగా ఉంటూనే కూటమి నేతలకు దగ్గరయ్యేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు.

శిలాఫలకంలో పేరు కోసమే...

నా హయాంలో 16 నెలల పాటు కష్టపడి వాణిజ్య సముదాయం నిర్మించాం. బదిలీపై పుట్టపర్తికి వెళుతున్నాను. ఇన్నాళ్లు నిర్మాణానికి కష్టపడ్డాను. శిలాఫలకంలో నా పేరు ఉండాలని భావించి ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు చేశాను. - సుధాకర్‌రెడ్డి, సీఈవో, జిల్లా పరిషత్తు

ఏఎఫ్‌యూ పరీక్ష ఫలితాల విడుదల

వైవీయూ, న్యూస్‌టుడే : కడప నగరంలోని డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ విశ్వవిద్యాలయంలో స్కూల్ ఆఫ్ ప్లానింగ్ ఆర్కిటెక్చర్, కాలేజ్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్‌కు సంబంధించిన మొదటి సెమిస్టర్ నుంచి ఎనిమిదో సెమిస్టర్ వరకు ఇన్‌స్టెంట్ పరీక్ష ఫలితాలు మంగళవారం విడుదలయ్యాయి. విశ్వవిద్యాలయ బాధ్య రిజిస్ట్రార్, ఆడిషనల్ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ రాజేష్‌కుమార్‌రెడ్డి ఫలితాలు విడుదల చేశారు. ఫలితాలను కళాశాల వెబ్‌సైట్‌లో పొందుపరిచామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయం ప్రతినిధులు ఫణీంద్రరెడ్డి, ఉదయప్రకాష్‌రెడ్డి, లక్ష్మీప్రవల్లిక తదితరులు పాల్గొన్నారు.

వైకాపాతో అంటకాగి... ఆపై అందలమెక్కి!

ఆర్అండ్‌బీ ఇంజినీర్ బదిలీపై ఉన్నతస్థాయిలో చర్చ

ఈనాడు, కడప: వైకాపాతో అంటకాగిన పలువురు అధికారులు బదిలీల్లో అందలం ఎక్కడంపై సర్వత్రా చర్చ సాగుతోంది. వైకాపా అధినేత జగన్‌కు సమీప బంధువు ఆర్అండ్‌బీ (జాతీయ రహదారులు) సబ్ డివిజన్ విభాగంలో కడప ఈఈగా పనిచేస్తుండగా, తాజా బదిలీల్లో పులివెందులకు చోటుదక్కించుకున్నారు. ఈ బదిలీ వ్యవహారంపై రాష్ట్ర ప్రభుత్వ స్థాయిలో చర్చకు దారి తీసి విచారణ జరుగుతున్నట్లు సమాచారం. గృహ నిర్మాణసంస్థలో రాయచోటి డీఈగా పని చేసిన చంద్రశేఖర్... నారాయణరెడ్డిపల్లె లేఅవుట్‌లో చోటుచేసుకున్న అక్రమాల్లో పాత్ర ఉన్నట్లుగా కలెక్టర్ శ్రీధర్ జరిపించిన విచారణలో తేల్చారు. ఈయనపై చర్యలు తీసుకోవాలంటూ ఆ సంస్థను కోరుతూ నివేదిక పంపారు. తాజాగా ఈయనకు ఈఈగా ఉద్యోగోన్నతి కల్పిస్తూ నూజివీడు ఈఈగా నియమించారు.

10 వేల మెగావాట్లతో సౌర విద్యుత్తు ప్లాంటు

ఎర్రగుంట్ల, న్యూస్‌టుడే: జమ్మలమడుగు నియోజకవర్గంలో 10 వేల మెగావాట్ల విద్యుత్తు ఉత్పత్తి చేసేవిధంగా సౌర విద్యుత్తు ప్లాంటు నిర్మించబోతున్నట్లు భాజపా ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి తెలిపారు. ఎర్రగుంట్ల నగరపంచాయతీలో మంగళవారం జరిగిన కౌన్సిల్ సమావేశం అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వం నిర్ణయించిన ప్రదేశం ఆర్టీపీపీ - కన్యతీర్థం మార్గంమధ్యలో ఉక్కు పరిశ్రమను స్థాపించ నున్నట్లు వివరించారు. వీటి ద్వారా వేలాది మందికి ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని తెలిపారు.


మాట్లాడుతున్న జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి

వర్షాకాలం వచ్చేసింది... ముంచేసింది!

ముంపు బారిన కడప నగరంలోని ఎస్‌బీఐ కాలనీ ☛ వరద కాలువ నిర్మాణం పూర్తిచేయని అధికారులు


కాలనీలోని ప్రధాన రహదారిపై నిలిచిన వరదనీటిని మళ్లిస్తున్న పొక్లెయిన్

– న్యూస్‌టుడే, కడప నగరపాలక

కడప నగరంలో రూ.4 కోట్లతో ప్రారంభించిన వరద కాలువతో ప్రయోజనం లేకుండాపోయింది.! మంగళవారం తెల్లవారుజామున కురిసిన భారీ వర్షానికి స్థానిక ఎస్‌బీఐ కాలనీలోని పలు వీధులు జలమయం కాగా, ఓ అపార్టుమెంటులోకి వరదనీరు చొరబడింది. ప్రధాన రహదారిపై మోకాలిలోతున నీళ్లు నిలబడడంతో రాకపోకలకు ఇబ్బందులు ఎదురయ్యాయి. దీంతో కడప నగరపాలక సంస్థ అధికారులు తాత్కాలిక ఉపశమన చర్యలు ప్రారంభించారు. ప్రధాన రహదారిపై నిలిచిన వరదనీరు కాలువలోకి మళ్లించేందుకు ఇటీవల నిర్మించిన కాలువలకు గండ్లు కొట్టారు. వరద కాలువ నిర్మాణం చేపట్టని ప్రాంతంలో రహదారి పక్కన కచ్చా కాలువను తవ్వి మరో వైపు నుంచి వరద నీటిని మళ్లించడానికి తాత్కాలిక చర్యలు చేపట్టారు. రూ.కోట్లతో నిర్మించిన వరద కాలువకు పెట్టిన గండ్లు పూడ్చడానికి మళ్లీ మరమ్మతులు చేపట్టాలి. తాత్కాలికంగా చేపట్టిన కచ్చా కాలువను ఎస్‌బీఐ కాలనీకి మరోవైపున ఉన్న కాలువకు అనుసంధానించడానికి అదనపు నిధులు కావాలి. కచ్చా కాలువ నంచి రోడ్లపైకి చేర్చిన వ్యర్థాలను తొలగించడం మరొక పని . ఈ పనులు పూర్తి చేసిన తరువాత బుధవారం లేదా గురువారం మళ్లీ వర్షాలు కురిస్తే ... మళ్లీ ఇదే తంతు! మరి ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం లేదా ? 250 మీటర్ల వరద రాలువ నిర్మాణాన్ని పూర్తి చేస్తే సమస్యకు శాశ్వత పరిష్కారం దొరుకుతుంది. ఇందుకు నిధులు సైతం సిద్ధంగా ఉన్నాయి. కాలువ నిర్మాణం పూర్తిచేయకపోతే ఎస్‌బీఐ కాలనీకి ముంపు ముప్పు తప్పదని హెచ్చరిస్తూ 'ఈనాడు'లో గత ఆగస్టు 20న కథనం ప్రచురితమైంది. స్థలసేకరణ సమస్యతో 250 మీటర్ల వరద కాలువ నిర్మాణాన్ని చేపట్టలేకపోతున్నామని ఇంజినీరింగ్ అధికారులు చెబుతున్నారు. ప్రణాళిక విభాగం సిబ్బంది మార్కింగ్ ఇచ్చిన వెంటనే పనులు ప్రారంభిస్తామని చెప్పి నెల దాటుతున్నా పనులు మొదలు కాలేదు.


జాతీయ రహదారి వరకు వచ్చి నిలిచిపోయిన వరద కాలువ నిర్మాణం

స్థలం ఉందో... లేదో తెలియకుండానే టెండర్లు?

ఎస్‌బీఐ కాలనీలోని వివిధ వీధుల నుంచి వరద కాలువ నిర్మాణాన్ని పూర్తి చేసి వీటన్నింటినీ అనుసంధానించి కర్నూలు-చిత్తూరు జాతీయ రహదారి మీదుగా బిల్టప్ కూడలిలో విద్యుత్తు ఉపకేంద్రం పక్కన ఉన్న వాగులోకి వరద నీటిని మళ్లించాలి. వాగు నుంచి వచ్చే వరద నీరు పెన్నా నదిలోకి చేరుతుంది. ఈ పనులకు రూ.4 కోట్ల నిధులు కేటాయించారు. దాదాపు ఏడాది కిందట పనులు మొదలుపెట్టారు. జాతీయ రహదారి వరకు వరద కాలువ నిర్మాణాన్ని పూర్తి చేశారు. అక్కడ నుంచి బిల్టప్ కూడలిలోని వాగు వరకు వరద నీటిని తీసుకు పోవడానికి 250 మీటర్ల వరద కాలువను కట్టాల్సి ఉంది. ఆ మేరకు నిర్మాణం చేయడానికి కావాల్సిన స్థలం లేదని ఇంజినీరింగ్ అధికారులు పనులకు తెరదించారు. కాలువ నిర్మాణానికి కావాల్సిన స్థలం ఉందో లేదో తెలియకుండా పనులకు టెండర్లు ఎలా పిలిచారు? పనులు మొదలైన అనంతరం స్థలసేకరణ సమస్య వచ్చి ఉంటే దాన్ని పరిష్కరించడానికి ఎలాంటి చర్యలు తీసుకున్నారు? స్థల సేకరణ వీలు కాకపోతే జాతీయ రహదారిపై కల్వర్టు కట్టి రోడ్డుకు అవతలి వైపునకు వరద నీటిని మళ్లించడానికి ఎందుకు చర్యలు తీసుకోలేదు? ఈ ప్రశ్నలకు సమాధానాలను దాటవేస్తూ వరద కాలువ నిర్మాణాన్ని మధ్యలో ఆపేశారు. దీంతో రూ.కోట్లు ఖర్చు చేసినా కాలనీ వాసులకు ముంపు ముప్పు తప్పలేదు.

శాశ్వత పరిష్కారం చూపనున్నాం

ఎస్‌బీఐ కాలనీ నుంచి తూర్పు దిశలో జాతీయ రహదారి మీదుగా వరద కాలువ నిర్మాణానికి కావాల్సిన స్థలం ఇవ్వడానికి భూయజమానులు అంగీకరించారు. ఇందుకు ఇవ్వాల్సిన పరిహారంపై చర్చలు జరుగుతున్నాయి. కాలువకు ప్రత్యామ్నాయంగా పడమర వైపు కాలువ నిర్మించాలని నిర్ణయించాం. దీన్ని ఎవరెస్టు ఇండస్ట్రీస్ ప్రాంతంలో ఇప్పటికే ఉన్న కాలువకు అనుసంధానం చేస్తాం. రెండు వరద కాలువల నిర్మాణాన్ని త్వరలో పూర్తి చేసి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతాం.

- నందన్, కమిషనర్, కడప నగరపాలక సంస్థ

మాతృ మరణాల నివారణకు ప్రత్యేక చర్యలు


అధికారులకు సూచనలిస్తున్న కలెక్టరు శివశంకర్, పక్కన డీఎంహెచ్‌వో డాక్టర్ నాగరాజు

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే : మాతృమరణాల నివారణకు అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ శివశంకర్ పేర్కొన్నారు. కడప కలెక్టరేట్‌లో మంగళవారం ప్రసూతి మరణాల విచారణ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏ తల్లీ జన్మిస్తూ మరణించకూడదని, అదే సమయంలో ఏ బిడ్డ కూడా మరణించకుండా వైద్యులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో నమోదైన తల్లులు, గర్భిణులు వివరాలను ఎప్పటికప్పుడు తెలుసుకునే క్రమంలో క్రమం తప్పకుండా విధులకు హాజరుకావాలన్నారు. ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలన్నారు. ఇందుకు సంబంధించి అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, ఆశాలు, అంగన్‌వాడీ కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలన్నారు. సమావేశంలో డీఎంహెచ్‌వో డాక్టర్ నాగరాజు, ఐసీడీఎస్ పీడీ శ్రీలక్ష్మీ, ఏడీఎంహెచ్‌వో డాక్టర్ ఉమామహేశ్వర్‌కుమార్, డీసీహెచ్ఎస్ డాక్టర్ హిమదేవి తదితరులు పాల్గొన్నారు.

గండి లడ్డూలో నాణ్యతెంత?

నాసిరకం సరకులు వెనక్కి పంపిన వైనం ◦ ఆలయంలో గుత్తేదారులదే గుత్తాధిపత్యం

– న్యూస్‌టుడే, వేంపల్లె, చక్రాయపేట

తిరుమల లడ్డూ ప్రసాదంలో వినియోగించే నెయ్యిలో కల్తీ జరిగిందని గుర్తించడంతో అశేష భక్తజనం నివ్వెరపోయారు. ఈ నేపథ్యంలో ఉమ్మడి కడప జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం గండి శ్రీవీరాంజనేయ స్వామి ఆలయానికి వచ్చే భక్తులకు విక్రయించే లడ్డూ ప్రసాదం నాణ్యతపైనా అనుమానాలు తలెత్తుతున్నాయి. ఆలయానికి ప్రతిరోజూ, ప్రధానంగా శనివారం వేలాదిమంది భక్తులు తరలివస్తుంటారు. ఆలయ వార్షిక ఆదాయం రూ.4.50 కోట్లకుపైగానే ఉంటుంది. భక్తులకు 200 గ్రాముల బరువుతో ఉన్న లడ్డూ ప్రసాదాన్ని రూ.50కు విక్రయిస్తుంటారు.


భక్తులకు విక్రయించేందుకు సిద్ధంగా ఉంచిన లడ్డూలు

◆ ఆలయానికి వచ్చే భక్తులకు విక్రయించేందుకు లడ్డూ ప్రసాదం తయారీకి వినియోగించే సరకులకు ఏటా ఆలయ అధికారులు టెండర్లు నిర్వహిస్తున్నారు. ప్రస్తుత ఏడాదికి సంబంధించి హైదరాబాద్‌కు చెందిన ఓ సంస్థ టెండరును దక్కించుకుంది. వీటితోపాటు మరో రెండు సంస్థలు కూడా ఎక్కువ మొత్తానికి టెండర్లు వేశాయి. ఈ మూడు సంస్థలు ఒకరివేనన్న విమర్శలుండగా, వీటికే ఒక్కో ఏడాది సరకుల సరఫరా టెండర్లు దక్కుతుండడం గమనార్హం. ఉన్నతస్థాయిలో రాజకీయ పలుకుబడి, అధికారులకు కమీషన్లు తదితర కారణాలతో ఆయా సంస్థలకే టెండర్లు దక్కుతున్నాయి. ఆలయానికి సంబంధించి గత తొమ్మిదేళ్లుగా ఆయా సంస్థలకే టెండర్లు దక్కుతున్నాయంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. లడ్డూ ప్రసాదం తయారీకి సరకులకు నెలకు రూ.10 లక్షలకు పైగా ఖర్చవుతోంది. ప్రసాదాల తయారీకి నాసిరకం సరకులే సరఫరా చేస్తున్నారన్న ఆరోపణలున్నాయి. లడ్డూ ప్రసాదం నాణ్యతపై భక్తులు అధికారులకు ఫిర్యాదులు చేసినా చర్యలు తీసుకున్న దాఖలాల్లేవు. ఇక్కడ నెలకు 25వేలకు పైగా లడ్డూ ప్రసాదాలు విక్రయాలు జరుగుతుంటాయి. ప్రధానంగా శ్రావణమాసోత్సవాల సందర్భంగా ఒక్క నెలలోనే 1.50 లక్షలకుపైగా లడ్డూ ప్రసాదాలు విక్రయించారు.

నాసిరకం సరకుల వెనక్కి: గండి అంజన్న భక్తులకు అందించే లడ్డూ ప్రసాదం తయారీకి సరఫరా చేసే సరకుల పరిశీలనకు ప్రస్తుత ఆలయ బాధ్య సహాయ కమిషనర్ వెంకటసుబ్బయ్య ఉద్యోగులతో కమిటీ ఏర్పాటు చేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు, ఇన్‌స్పెక్టర్, సూపరింటెండెంట్, జూనియర్ అసిస్టెంట్‌లతో ఏర్పాటు చేసిన కమిటీ అన్నదానం, లడ్డూల తయారీకి గుత్తేదారు సంస్థ పంపించే సరకులను క్షుణ్ణంగా పరిశీలించిన తరువాతే వినియోగించాల్సి ఉంది. లడ్డూ ప్రసాదాల తయారీకి గత జులైలో హైదరాబాద్‌కు చెందిన గుత్తేదారు సంస్థ పంపించిన నెయ్యి, నూనె, జీడిపప్పు, ఎండుద్రాక్ష నాసిరకంగా ఉండడంతో కమిటీ సూచనల మేరకు వాటిని వెనక్కి పంపారు.

తయారీలో గోల్‌మాల్

గండి క్షేత్రంలో లడ్డూ ప్రసాదం తయారీ కేంద్రంలో పెద్దఎత్తున గోల్‌మాల్ జరిగింది. ఇక్కడ మూడున్నరేళ్లుగా నెయ్యి కొనుగోలు, లడ్డూ తూకాల్లో పెద్ద ఎత్తున అవకతవకలు చోటుచేసుకున్నాయి. సరకులు పంపిణీ చేసే గుత్తేదారు సంస్థతో కుమ్మక్కై లడ్డూల తయారీ కేంద్రంలో పనిచేసే ఉద్యోగి సదరు అధికారితో రహస్య ఒప్పందం కుదుర్చుకుని మిగిలిన నెయ్యిని ఇండెంట్‌గా చూపించి దోచుకున్నారు.

వెనక్కి పంపడం వాస్తవమే

గండి అంజన్న ఆలయంలో లడ్డూ ప్రసాదం తయారీకి హైదరాబాద్‌కు చెందిన గుత్తేదారు సంస్థ పంపించిన నాసిరకం సరకులను వెనక్కి పంపిన విషయం వాస్తవమే. తిరుమల లడ్డూ ప్రసాదం వ్యవహారం తెరపైకి రావడంతో దేవాదాయశాఖ కమిషనర్ అన్ని దేవాలయాల ఈవోలతో మాట్లాడారు. నెయ్యి ఎక్కడి నుంచి తెప్పిస్తున్నారు..సరకుల నాణ్యత, వినియోగం పరిశీలించాలని ఆదేశించారు. భక్తులకు నాణ్యమైన లడ్డూ ప్రసాదం విక్రయించేందుకు అన్ని చర్యలు తీసుకుంటాం. లోటుపాట్లు సరిదిద్దుతాం.

- వెంకటసుబ్బయ్య, బాధ్య సహాయ కమిషనర్, గండి క్షేత్రం

ఆలయాల అభివృద్ధికి చర్యలు



మల్లికార్జునప్రసాద్‌ను ఆశీర్వదిస్తున్న అర్చకులు

మారుతీనగర్, న్యూస్‌టుడే : జిల్లాలోని అన్ని ఆలయాల అభివృద్ధికి ఈవోలు, ఇతర అధికారులు సమన్వయంతో పని చేయాలని దేవదాయశాఖ సహాయక కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన మల్లికార్జున ప్రసాద్ తెలిపారు. స్థానిక దేవదాయ శాఖ కార్యాలయంలో మంగళవారం ఆయన పూర్తిస్థాయిలో సహాయ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా నగరంలోని పలు ఆలయాల అర్చకులు ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. జిల్లాలోని అన్ని ఆలయాల్లో భక్తులకు మెరుగైన వసతులు, సౌకర్యాలు కల్పిస్తామని, ఆలయాల్లో ఏవైనా సమస్యలుంటే భక్తులు తమ దృష్టికి తీసుకొస్తే వెంటనే పరిష్కరిస్తామన్నారు. వేదపారాయణం చేసిన వారు దరఖాస్తులు చేసుకుంటే ప్రభుత్వం నుంచి రూ.3 వేల నగదు అందిస్తామని ఈ నెల 25వ తేదీలోగా దరఖాస్తులను నేరుగా దేవదాయశాఖ కార్యాలయంలో అందించాలన్నారు. జిల్లాలో 16 మందికి డీడీఎల్ మంజూరు చేశామని. డీడీఎల్ రానివారు తమ దృష్టికి తీసుకురావాలన్నారు.



ధర్నా చేస్తున్న డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు చిన్ని, తదితరులు

విద్యార్థిని కొట్టిన టీచరుపై చర్యలకు డిమాండు

బద్వేలు, న్యూస్‌టుడే: బద్వేలు బాలికల ఉన్నత పాఠశాలలో ఏడో తరగతి విద్యార్థిని మహిమను కొట్టి ఆసుపత్రిపాలు చేసిన టీచరును సస్పెండ్ చేయాలని కోరుతూ స్థానిక ఎంఈవో కార్యాలయం ఎదుట మంగళవారం డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో ధర్నా జరిగింది. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు చిన్ని మాట్లాడుతూ తరగతి గదిలో విద్యార్థినితో మాట్లాడిందని పిలిచి వీపుపై మహిమను పిడిగుద్దులు కొట్టిన కారణంగా శ్వాస పీల్చుకోవడంలో ఇబ్బంది కల్గి అంబులెన్సులో కడప రిమ్స్‌కు తరలించారన్నారు. విద్యార్థి ఆరోగ్య పరిస్థితి సరిలేదని వైద్యులు ఐసీలో ఉంచి చికిత్స చేశారన్నారు. ఈ ఘటన జరిగి ఐదు రోజులు కావస్తున్నా విద్యాశాఖ అధికారులు పట్టించుకోలేదని ఆరోపించారు. ఈ ఘటనను జిల్లా కలెక్టరేట్‌ను కలిసి పిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

27న ఉద్యోగ మేళా

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే : జిల్లాలోని పోరుమామిళ్ల, వేముల, కమలాపురంలో ఈ నెల 27న ఉద్యోగమేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి సురేష్‌కుమార్ మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కమలాపురంలోని పాలిటెక్నిక్ కళాశాల, వేములలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాల, పోరుమామిళ్లలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో నిర్వహించే ఉద్యోగమేళాల్లో పలు ప్రముఖ కంపెనీలు పాల్గొంటున్నాయన్నారు. పదో తరగతి, ఆపై విద్యార్హత కలిగిన 32 ఏళ్లలోపు ఉన్న యువత తమ పూర్తి విద్యార్హత పత్రాలతో హాజరుకావాలని పేర్కొన్నారు.

కృష్ణమ్మ వచ్చేదెప్పుడు...
ఆయకట్టుకు చేరేదెప్పుడు?

- వాగులు, నదులపై నిలిచిపోయిన పనులు
- కాంక్రీటు నిర్మాణాలపై అంతులేని నిర్లక్ష్యం
- ఇదీ జీఎన్ఎస్ఎస్ రెండో దశ తీరు



ముగమేరు వద్ద నిలిచిపోయిన నిర్మాణం

శ్రీ కృష్ణదేవ రాయ గాలేరు-నగరి సుజల స్రవంతి పథకం రెండో దశలో కీలకమైన పనులు చేపట్టలేదు. కాలువల్లో మట్టి పనులకు ప్రాధాన్యమిస్తున్నారు. కాంక్రీటు నిర్మాణాలను కొన్నిచోట్ల చేపట్టి అసంపూర్తిగా వదిలేశారు. మరికొన్ని ప్రాంతాల్లో దిగువ ప్రాంతానికి కృష్ణా జలాలు చేరడానికి వాగులు, నదుల్లో కట్టడాలను అసలు మొదలు పెట్టలేదు. ఆక్విడెక్టు నిర్మించకపోతే ఆయకట్టుకు నీరందే అవకాశం లేదు. ఇది నీటిపారుదలశాఖ సాంకేతిక నిపుణులకు తెలిసినా ఇన్నాళ్లు పెద్దగా పట్టించుకోలేదు. గుత్తేదారులు కూడా పనులు చేయకుండా ఆపేశారు. కళ్లెదుటే అపార జల నిధి అందుబాటులో ఉన్నా కరవు సీమలో బీడు వారిన నేలను కృష్ణవేణి స్పర్శ తాకలేదు. దుర్భిక్ష గడ్డలో తడారిన భూములకు సస్యశ్యామలం భాగ్యం దక్కడం లేదు. అదే ఆయకట్టు రైతులకు శాపంగా మారింది.
-న్యూస్‌టుడే, కడప

జీఎన్ఎస్ఎస్ రెండో దశ ప్యాకేజీ-1లో వేముల మండలం నాగేపల్లె సమీపంలో ముగమేరులో నిర్మించాల్సిన ఆక్విడెక్ట్ పనులు ముందుకు కదలడం లేదు. ఉమ్మడి కడప జిల్లాలో ఏడు ప్యాకేజీల్లో 1.20 లక్షల ఎకరాలు, చిత్తూరులో 1,03,500 ఎకరాలు, నెల్లూరులో 1,500 ఎకరాలకు కృష్ణా జలాలు చేరాలంటే ఈ కట్టడం చాలా కీలకం. గాలేరు-నగరి- హంద్రీనీవా పథకాన్ని అనుసంధానం చేసి 20 టీఎంసీలను తరలించాల్సి ఉంది. వైఎస్ఆర్, అన్నమయ్య, చిత్తూరు జిల్లాల్లో 2.91 లక్షల ఎకరాలకు సాగునీరివ్వాలి.

● ప్యాకేజీ-1లో ఒప్పందం విలువ రూ.371.42 కోట్లు. నాలుగేళ్ల కిందట కిందట మేఘా-రాఘవ సంస్థలు సంయుక్తంగా దక్కించుకుని చేపట్టాయి. ఆ తర్వాత రూ. 419.02 కోట్లకు సవరించారు. ఇప్పటికే జరిగిన పని విలువ రూ.398 కోట్లు. ముగమేరు పైన నీటి ప్రవాహం సాఫీగా ముందుకు సాగడానికి అనువుగా ఆక్విడెక్ట్ 300 మీటర్లు పొడవు నిర్మించాలని తొలుత నిర్ణయించారు. నాటి అక్విడెక్ట్ ప్రకారం 2,895 క్యూసెక్కుల సామర్థ్యం. అప్పట్లో రూ.29.70 కోట్లకు అనుమతిచ్చారు. అనంతరం సాంకేతిక నిపుణుల బృందాన్ని పిలిపించారు. భవిష్యత్తులో కట్టడం పటిష్ఠంగా ఉండాలంటే 41-42.60 కి.మీ వరకు అయిదు వేల క్యూసెక్కుల సామర్థ్యంతో 1.60 కి.మీ పొడవు నిర్మించాలని ప్రతిపాదించగా ఉన్నత స్థాయిలో ఆమోదించారు. ఇందుకోసం రూ. 310.60 కోట్లు కావాలి. ఇక్కడ మొత్తం 54 పిల్లర్లు నిర్మించాల్సి ఉండగా కొంతమేర నిర్మించి నిలిపివేశారు. మొదట ఇంజినీరింగ్ అధికారులు ఈ పనిని పూర్తి చేయించాలని ఆలోచించారు. మట్టి తవ్వకం, వారధుల నిర్మాణం, సిమెంటు పూతపై దృష్టి సారించారు. గండి కోట నుంచి నీటిని తీసుకొచ్చినా దిగువ ప్రాంతానికి చేరే పరిస్థితి లేదు.

● ప్యాకేజీ-2లో 12 వేలు, పీ-3లో 25 వేలు, పీ-4లో 10 వేలు, పీ-5లో అయిదు వేలు, పీ-6లో 18 వేలు, ప్యాకేజీ-7లో 40 వేల ఎకరాలకు నీరు చేరాలంటే ఆక్విడెక్ట్ పూర్తవ్వాలి. ఇక్కడ కనీసం నాలుగో వంతు కూడా చేయలేదు. ప్యాకేజీ-1 పనులను నాటి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కుటుంబ సభ్యులు చేస్తుండటంతో సాంకేతిక నిపుణులు కూడా గట్టిగా ప్రశ్నించలేదు. నిర్దేశిత ఒప్పందం ప్రకారం ఎలాగైనా చేయాలని ఒత్తిడి చేస్తే బదిలీ వేటు పడుతుందని భయపడి ఆయాచితంగా లబ్ధి చేకూర్చే ప్రయత్నం చేశారు. ఈలోగా సార్వత్రిక ఎన్నికలు రావడం, ఎన్డీయే కూటమి పాలనా పగ్గాలు చేపట్టడంతో కథ అడ్డం తిరిగింది. పని చేసినా బిల్లులు రావని బెంగతో చేయడానికి గుత్తేదారులు ముందుకు రాలేదు.

పాపఘ్నిలో నిర్మించేనా?

ప్యాకేజీ-2లో (66.150-96.500 కి.మీ) వరకు పనులు చేయాలని 2020, మే 4న రూ.398 కోట్లతో ఒప్పందం జరిగింది. ఆనక రూ.460 కోట్లకు అంచనాలను పెంచారు. ఇప్పటికే రూ.209 కోట్లు వెచ్చించారు. పెండ్లిమర్రి మండలం నందిమండలం శివారులో పాపఘ్ని నదిలో (67.900-68.60 కి.మీ వరకు) నీటి సరఫరా కోసం ప్రధాన కాంక్రీటు కట్టడాన్ని 2,927 క్యూసెక్కుల ప్రవాహ సామర్థ్యంతో 700 మీటర్ల పొడవు, అటు, ఇటు అనుసంధానం చేయడానికి 400 మీటర్ల పనులు చేయాల్సి ఉంది. ఇందుకోసం రూ.82.92 కోట్లు కావాలని ఇప్పుడు నిర్ణయించారు. పాపఘ్నిలో ఎలాంటి కదలిక లేదు. ఇక్కడ ఆక్విడెక్ట్ నిర్మించి కాలువను పూర్తి చేస్తేనే దిగువ ప్రాంతాలకి కృష్ణా జలాలు వెళ్లడానికి మార్గం సుగమం కానుంది. లేదంటే అన్నదాతలకు ఎదురుచూపులు తప్పవు.

వెయ్యినూతుల కోనలో అదే తీరు

వెయ్యినూతుల కోన ఆలయం సమీపంలోని వాగు నుంచి కృష్ణమ్మను దాటించాలంటే 81.050-81.525 కి.మీ మధ్యలో ప్రధాన నిర్మాణం 475 మీటర్లు, అనుసంధానం కాలువ 300 మీటర్లు నిర్మించాలి. ఇది పూర్తయితే 2,898 క్యూసెక్కులు తరలించవచ్చు. ఇందుకోసం రూ.28.24 కోట్లు అవసరం. ఇక్కడ ఎలాంటి పురోగతి లేదు.

పాలతల శివారులో అంతేనా

పాలతల శివారు 94.640-95.215 కి.మీ వరకు రెండు కొండల మధ్య సిమెంటు కాంక్రీట్ కట్టడాన్ని 575 మీటర్లు, అనుసంధాన నిర్మాణాలు 300 మీటర్లు చేపట్టాలి. ఇది పూర్తయితే 2,898 క్యూసెక్కులు ప్యాకేజీ-3-7 వరకు 2,898 క్యూసెక్కులను తీసుకెళ్లవచ్చు. అదేవిధంగా చిత్తూరు, నెల్లూరు జిల్లాలకు తరలించే వీలు ఉంటుంది. ఇక్కడ కూడా నిర్మాణాల్లో కదలిక లేదు.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం

జీఎన్ఎస్ఎస్ రెండో దశ ప్యాకేజీ-1, 2లో ముగమేరు, పాపఘ్ని, వెయ్యినూతుల కోన, పాలతల సమీపంలో ఆక్విడెక్ట్‌లు నిర్మించాల్సిన మాట వాస్తవమే. ఇవి పూర్తయితేనే దిగువ ప్రాంతానికి కృష్ణా జలాలు వెళతాయి. లేదంటే ఆయకట్టుకు నీరందే పరిస్థితి లేదు. పనులు పూర్తి చేయడానికి అనుమతితోపాటు నిధులివ్వాలని ఇటీవల ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ఉన్నత స్థాయి నుంచి ఉత్తర్వులు రాగానే పనులను మొదలు పెట్టి శరవేగంగా పూర్తి చేయిస్తాం. నిర్దేశిత ఆయకట్టుకు నీరిస్తాం. - ఎం.మల్లికార్జునరెడ్డి, సీఈ, నీటిపారుదల శాఖ, కడప

వైకాపాకు జడ్పీటీసీ దంపతుల రాజీనామా

వారి బాటలోనే ఎంపీటీసీసభ్యుడు, మాజీ సర్పంచులు



రాజీనామా పత్రాన్ని చూపుతున్న వీఎన్‌పల్లి జడ్పీటీసీసభ్యురాలు రాజేశ్వరమ్మ, ఏపీపీఎస్సీ బోర్డు మాజీ సభ్యుడు సుధాకర్‌రెడ్డి

వేంపల్లె, వీరపనాయునిపల్లె, న్యూస్‌టుడే: వీరపనాయునిపల్లె మండల వైకాపా జడ్పీటీసీ సభ్యురాలు నిమ్మకాయల రాజేశ్వరమ్మ, ఆమె భర్త ఏపీపీఎస్సీ బోర్డు మాజీ సభ్యుడు, వైకాపా రాష్ట్ర అధికార ప్రతినిధి నిమ్మకాయల సుధాకర్‌రెడ్డి తన వర్గీయులతో కలిసి త్వరలో తెదేపాలో చేరనున్నారు. ఈమేరకు మంగళవారం అయ్యవారిపల్లెలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి వైకాపా ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ 2011లో తాను కమలాపురం మార్కెట్ కమిటీ ఛైర్మన్‌గా ఉంటూ వైకాపా అధినేత జగన్‌కోసం ఆ పదవికి రాజీనామా చేసి ఆయన వెంట నడిచానని, 2014లో అనంతపురం జిల్లా పెనుగొండ, 2019లో రాప్తాడు, 2024 ఎన్నికల్లో బద్వేలు నియోజకవర్గాలకు వైకాపా తరఫున పరిశీలకుడిగా పనిచేశానన్నారు. 13 ఏళ్లుగా తాను పార్టీకోసం పనిచేసినా కొంతకాలంగా జగన్ అనుసరిస్తున్న విధానాలు తనకు బాధ కల్గిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కమలాపురం నియోజకవర్గ ప్రజలకు న్యాయం చేయలేని మాజీ ఎమ్మెల్యే రవీంద్రనాథరెడ్డికి వైకాపా జిల్లా అధ్యక్షపదవి అప్పగించడం జగన్ చేసిన తప్పిదమన్నారు. విజయవాడలో వరదలొస్తే 74 ఏళ్ల వయసున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు బాధితులను ఆదుకునేందుకు ట్రాక్టర్లు, జేసీబీలలో వెళ్లి వారికి ధైర్యం ఇస్తుంటే సీఎం వల్లే వరదలు వచ్చాయని జగన్ పరిపక్వతలేని మాటలు మాట్లాడారని మండిపడ్డారు. అసమర్థుడి వద్ద పనిచేయడం అంటే సమాజానికి నష్టం చేసినవారమేనని తెలిపారు. మంచి నాయకుడి వద్ద పనిచేసేందుకే తాము వైకాపాను వీడుతున్నట్లు ప్రకటించారు. హిందూవుల మనోభావాలను దెబ్బతీసిన తిరుమల లడ్డూ విషయంలోనూ జగన్ సరైనరీతిలో సమాధానం చెప్పలేదన్నారు. ఒకటా.. రెండా.. అన్నింటా జగన్ విఫలమయ్యారని ఆయన వెంట ఉండటం వృథా అని వారు ప్రకటించారు. పాయసంపల్లె ఎంపీటీసీ రామాంజనేయరెడ్డి, ఎర్రమల్లపల్లె మాజీసర్పంచు శేఖర్‌రెడ్డి, వైకాపా నాయకులు ఆర్వీ రామిరెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, ఎన్వీరమణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

చినజీయర్‌స్వామి ట్రస్టు ప్రతినిధులపై విచారణ



మాట్లాడుతున్న ఆర్డీవో శ్రీనివాసులు, పక్కన ఉన్నతాధికారులు

ప్రొద్దుటూరు గ్రామీణ, న్యూస్‌టుడే: జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రొద్దుటూరులోని పూజ ఇంటర్నేషనల్ పాఠశాల నిర్వహణ బాధ్యతలను అప్పగించిన త్రిదండి చినజియర్‌స్వామి ట్రస్టు ప్రతినిధుల పనితీరుపై విచారణ చేస్తున్నట్లు ఆర్డీవో శ్రీనివాసులు తెలిపారు. మైలవరం డాడీహోం కమిటీ సభ్యుల ఫిర్యాదులు, ఆరోపణల దృష్ట్యా కలెక్టరు నియమించిన ప్రత్యేక కమిటీ సభ్యులతో కలిసి విచారణ చేశారు. డాడీ హోమ్ కమిటీ ఛైర్‌పర్సన్ రాధ, సీఈవో కవిత, ఇతరులను తహసీల్దారు గదికి పిలిపించి వారికి కొత్త ట్రస్టు నుంచి విభేదాలు ఎందుకొచ్చాయో తెలుసుకున్నారు. అనంతరం ఆర్డీవో తన కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. బీఈడీ కళాశాల రెన్యూవల్ కోసం ధ్రువపత్రాలు ట్రస్టు వద్ద ఉన్నాయని, డిపాజిట్ కోసం నగదు చెల్లింపుపై ఏవిధమైన ప్రతిస్పందన లేదని డాడీహోం కమిటీ ప్రతినిధులు తమ దృష్టికి తీసుకొచ్చారన్నారు. రూ.16 లక్షల ఆర్థిక లావాదేవీలపై విచారణ చేపట్టాలని కోరినట్లు చెప్పారు. ట్రస్టుకు బదిలీ చేసిన నిర్వహణ బాధ్యతలకు వ్యతిరేకంగా డాడీహోం ప్రతినిధులు న్యాయస్థానంలో వ్యాజ్యం నమోదు చేసినట్లు తెలిపారు. విచారణకు హాజరుకాని ట్రస్టు అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు, కార్యదర్శి నుంచి వివరణ తీసుకుంటామన్నారు. కలెక్టరు నియమించిన కమిటీలోని జిల్లా సాంఘిక సంక్షేమశాఖ డీడీ సరస్వతి, జిల్లా సహకార సంఘం అధికారిణి సుభాషిణి, తహసీల్దారు గంగయ్య, డీఈవో ప్రతినిధిగా ఎంఈవో సావిత్రమ్మ పాల్గొన్నారు.

తల్లిదండ్రుల బాధ్యతా రాహిత్యం...
ఇద్దరు కుమార్తెల ఉసురు తీసింది

సిద్దవటం, న్యూస్‌టుడే : తీవ్ర అనారోగ్యానికి గురై ఇద్దరు చిన్నారులు మృతిచెందిన ఘటన జిల్లాలో మంగళవారం చోటు చేసుకుంది. రాజంపేట బోయనపల్లెకు చెందిన పన్నుగంటి కోరమ్మ, చెంచయ్య దంపతులకు ఆరుగురు సంతానం. ఒక కుమారుడు, అయిదుగురు కుమార్తెలు. దంపతులిద్దరూ ప్లాస్టిక్ వస్తువులు సేకరించి విక్రయిస్తూ జీవనం సాగిస్తున్నారు. వారం రోజుల కిందట బొగ్గిడివారిపల్లె పరిధి నిర్మలగిరికాలనీ వద్ద గుడారాలు వేసుకుని నివాసం ఉంటున్నారు. వీరి నాలుగో కుమార్తె కుమారి (6) అయిదో కుమార్తె చెంచమ్మ(4) కొన్ని రోజుల కిందట అనారోగ్యానికి గురయ్యారు. సోమవారం రాత్రి నుంచి తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. మంగళవారం మధ్యాహ్నానికి ఇద్దరూ పలకకపోవడంతో వారి సోదరి స్థానికులకు సమాచారమిచ్చింది. వారు వచ్చి పరిశీలించగా అప్పటికే కుమారి మృతి చెందింది. చెంచమ్మ ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉండడంతో అప్పటికే నిర్మలగిరి కాలనీలో వైద్య శిబిరం నిర్వహిస్తున్న 104 సిబ్బంది వద్దకు తీసుకెళ్లారు. ఏఎన్ఎం కుర్షిద్‌బేగం చిన్నారిని పరీక్షించగా కొద్దిసేపటికి ఆ బాలిక మృతి చెందింది. ఒకరి తర్వాత ఒకరు చనిపోవడంతో ఈ సంఘటన స్థానికులను కలచి వేసింది. సాయంత్రం గ్రామ సమీపంలోని శ్మశానవాటికలో చిన్నారుల మృతదేహాలకు గ్రామస్థులే అంత్యక్రియలు నిర్వహించారు.

విద్యార్థుల సాయం... బాధితులకు అభయం

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే : వరద బాధితుల సహాయార్థం వల్లూరు, కమలాపురంలోని వేదాస్ విద్యాసంస్థల విద్యార్థులు రూ.3.50 లక్షల విరాళాన్ని కలెక్టరు శివశంకర్‌కు అందించారు. మంగళవారం కలెక్టర్ ఛాంబరులో వేదాస్ విద్యాసంస్థల వైస్‌ఛైర్మన్ దిలీప్‌రెడ్డి, ప్రిన్సిపల్ ధర్మద్విరాజ్, ప్రధానోపాధ్యాయురాలు వసుంధరతో కలిసి విద్యార్థులు కలెక్టరుకు చెక్కు అందజేశారు.



కలెక్టరు శివశంకర్‌కు చెక్కు అందిస్తున్న వేదాస్ విద్యాసంస్థల విద్యార్థులు

● కడప నగరానికి చెందిన నాగార్జున మోడల్ స్కూల్ విద్యార్థులు రూ.1.20లక్షల విరాళాన్ని మంగళవారం కలెక్టర్ శివశంకర్‌కు అందించారు. ఇరు పాఠశాలల విద్యార్థులు, యాజమాన్యాలను కలెక్టరు అభినందించారు.

సీఎం సహాయనిధికి రూ.లక్ష విరాళం

బ్రహ్మంగారిమఠం : అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో అతిథి (పార్టుటైమ్) ఉపాధ్యాయులు సీఎం సహాయ నిధికి సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయులు ద్వారా రూ.లక్ష చెక్కును సీఎం చంద్రబాబునాయుడుకు అందజేశారు. వీరిని సీఎం అభినందించారు. అతిథి ఉపాధ్యాయుల సంఘం అధ్యక్షుడు నవీన్‌కుమార్, గురురత్నం, వర్మ, జ్యోతి, ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.



సీఎం చంద్రబాబు నాయుడుకు చెక్కు అందజేస్తున్న అతిథి ఉపాధ్యాయులు

రెవెన్యూ శాఖలో ఉద్యోగుల బదిలీలు

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే : జిల్లాలోని పలు మండలాల తహసీల్దార్లను బదిలీ చేస్తూ కలెక్టరు శివశంకర్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

తహసీల్దారు	పనిచేస్తున్న ప్రాంతం	బదిలీ స్థానం
గుర్రప్ప	సింహాద్రిపురం	కొండాపురం
మాధవకృష్ణారెడ్డి	కొండాపురం	కలెక్టరేట్
నాగేశ్వరరావు	కలెక్టరేట్	సింహాద్రిపురం
దస్తగిరయ్య	కేఆర్ఆర్సీ	జమ్మలమడుగు ఆర్డీవో కార్యాలయం
రమాకుమారి	ముద్దనూరు	చాపాడు
సరస్వతి	ఖాజీపేట	ముద్దనూరు
బాలనర్సింహులు	కాశీనాయన	పెద్దముడియం
వెంకటసుబ్బయ్య	పెద్దముడియం	కాశినాయన
మహబూబ్‌బాషా	కలసపాడు	ఖాజీపేట
రవీంద్రారెడ్డి	చాపాడు	కలసపాడు
మధురవాణి	దువ్వూరు	ఏవో, ఆర్డీవో ఆఫీసు, బద్వేలు,
అక్బర్‌బాషా	ఏవో, ఆర్డీవోఆఫీసు, బద్వేలు	దువ్వూరు
అలీఖాన్	బి.కోడూరు	కడప అర్బన్
సుబ్బలక్షుమ్మ	శ్రీసత్యసాయిజిల్లా	అట్లూరు
రామకిషోర్	బి.కోడూరు డిప్యూటీ తహసీల్దారు	బీకోడూరు ఎఫ్ఏసీ

● 21 మంది ఆఫీసు సబార్డినేటర్లు, డ్రైవర్లను బదిలీ చేశారు. వారితో పాటు 13 మంది టైపిస్టులు, 18 మంది జూనియర్ అసిస్టెంట్లు, 12 మంది జూనియర్ అసిస్టెంట్లు కమ్ జకంప్యూటర్ అసిస్టెంట్లులను బదిలీ చేస్తూ కలెక్టర్ శివశంకర్ ఉత్తర్వులు జారీ చేశారు.

వీఆర్ఏల సమస్యల పరిష్కారానికి వినతి

మారుతీనగర్, : వీఆర్ఏల సమస్యలు పరిష్కరించాలని మంగళగిరిలో మంగళవారం తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావును కలిసి వినతిపత్రం అందించినట్లు ఏపీ వీఆర్ఏల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నల్లిపోగు నాగేశం తెలిపారు. సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు నెల్లూరు సురేష్, రాష్ట్ర ఉపాధ్యక్షులు నాగసుబ్బయ్య పాల్గొన్నారు.

పోలీసుల కుటుంబాలకు వైద్య పరీక్షలు



మాట్లాడుతున్న ఏఎస్పీ ప్రకాష్‌బాబు, పక్కన ఏఆర్ అదనపు ఎస్పీ కృష్ణారావు, ఏఆర్ డీఎస్పీ మురళీధర్, తదితరులు

కడప, నేరవార్తలు, న్యూస్‌టుడే : పోలీసు కుటుంబాలకు చెందిన మహిళలు ఆరోగ్యంపై దృష్టి పెట్టాలని ఏఎస్పీ ప్రకాష్‌బాబు పేర్కొన్నారు. ఎస్పీ హర్షవర్ధన్‌రాజు ఆదేశాల మేరకు పోలీసు సిబ్బంది, పోలీసు కుటుంబాల మహిళలకు విజయవాడలోని మణిపాల్ ఆసుపత్రికి చెందిన సిబ్బందితో ఉమేష్‌చంద్ర కల్యాణమండపంలో మంగళవారం ఉచితంగా క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎస్పీ మాట్లాడుతూ.. మహిళలు ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అనారోగ్య లక్షణాలుంటే వెంటనే గుర్తించి వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. సకాలంలో వైద్యం తీసుకుంటే వ్యాధి నయమవుతుందన్నారు. స్క్రీనింగ్ ద్వారా క్యాన్సర్‌ను ప్రాథమిక దశలోనే గుర్తిస్తే అతి తక్కువ ఖర్చుతో నయమవుతుందన్నారు. స్క్రీనింగ్ పరీక్షలు బుధ, గురువారాలు కూడా కొనసాగుతాయని పోలీసు కుటుంబాలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఆర్ ఏఎస్పీ కృష్ణారావు, ఏఆర్ డీఎస్పీ మురళీధర్, కడప బాధ్య డీఎస్పీ రమాకాంత్, మణిపాల్ ఆసుపత్రి వైద్యురాలు దివ్య, జిల్లా పోలీసు అధికారుల సంఘం అధ్యక్షుడు దూలం సురేష్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉప్పు శంకర్, వినోద్‌కుమార్, లక్ష్మీదేవి, మాధవీలత, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

హోటల్ యజమాని హత్య కేసులో ముగ్గురికి యావజ్జీవ శిక్ష

మైదుకూరు, న్యూస్‌టుడే: మైదుకూరు మండలం ముదిరెడ్డిపల్లె గ్రామ పొలాల్లోని అతిథి గృహంలో జరిగిన కడపకు చెందిన లక్ష్మీభవన్ హోటల్ యజమాని ముద్దంశెట్టి వెంకటసుబ్బయ్య హత్య కేసులో మంగళవారం ముగ్గురికి యావజ్జీవ కారాగార శిక్షతో పాటు రూ.4 లక్షలు జరిమానా విధిస్తూ ప్రొద్దుటూరు రెండో అదనపు జడ్జి కోర్టు న్యాయమూర్తి రమేష్‌కుమార్ తీర్పు ఇచ్చారు. 2014 డిసెంబరు 30న జరిగిన ఈ హత్యకు సంబంధించి హతుడి చిన్న కుమారుడు ముద్దంశెట్టి శివప్రసాద్, పెద్దకోడలు సుప్రజ, సుప్రజ సోదరుడు మైలారం జగన్నాథ్‌లకు శిక్ష విధించినట్లు పేర్కొన్నారు. వెంకటసుబ్బయ్యకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె. పెద్ద కుమారుడు నాగరాజుకు సుప్రజతో వివాహం జరిపించారు. వీరికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఇంటి సమస్యతో నాగరాజు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకోగా హోటల్ నిర్వాహణ బాధ్యతలను సుప్రజకు అప్పగించారు. హోటల్లోని ఓ వ్యక్తితో సుప్రజకు వివాహేతర సంబంధం ఉన్నట్లు తెలిసి సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పని చేస్తూ హైదరాబాదులో ఉంటున్న రెండో కుమారుడు ముద్దంశెట్టి శివప్రసాద్ వద్దకు పిల్లలతో సహా పంపారు. అక్కడ కూడా ఆమె మరిదితో వివాహేతర సంబంధం పెట్టుకోవడం తెలిసిన వెంకటసుబ్బయ్య కుమార్తె ఇరువురిని మందలించారు. దీంతో ఆస్తిలో తన వాటా పంచి ఇవ్వాలని సుప్రజ తన మామ వెంకటసుబ్బయ్యను కోరగా అందుకు ఆయన నిరాకరించి ఆరెకరాలు మనవరాళ్లకు పంచుతానని స్పష్టం చేశారు. ఇది ఇష్టంలేని శివప్రసాద్, సుప్రజ, జగన్నాథం మైదుకూరు మండలం ముదిరెడ్డిపల్లె సమీప పొలాల్లోని గెస్ట్‌హౌస్‌లో ఉన్న వెంకటసుబ్బయ్యను వేటకొడవళ్లతో నరికి దారుణంగా హత్య చేసి పోలీస్‌స్టేషన్‌లో లొంగిపోయినట్లు పోలీసులు పేర్కొన్నారు. అప్పట్లో సీఐ వై.వెంకటేశ్వర్లు, ఎస్ఐ నరసింహారెడ్డి, హెడ్‌కానిస్టేబుల్ భాగ్యంరెడ్డితోపాటు పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మండలంలోని ఏకర్లపాలేనికి చెందిన తోటమాలి గుజ్జల మహేష్ ఫిర్యాదుతో కేసు నమోదు చేశారు. ఆస్తి కోసం, అక్రమ సంబంధానికి అడ్డు వస్తున్నాడనే కారణంతో వెంకటసుబ్బయ్యను హతమార్చినట్లు తెలిపారు. కానిస్టేబుళ్లు ఎ.నాగరాజు, రాజశేఖర్ సాక్షులను సకాలంలో కోర్టులో ప్రవేశపెట్టారు. కోర్టు అదనపు పీపీ బి.రాంప్రసాద్‌రెడ్డి తన వాదనతో నిందితులుగా ఉన్న శివప్రసాద్, జగన్నాథం, సుప్రజలకు శిక్షపడేలా చేశారని వివరించారు.



పోలీసుల అదుపులో శివప్రసాద్, జగన్నాథం, సుప్రజ

వేర్వేరు ప్రమాదాల్లో నలుగురి మృతి

కమలాపురం : మండలంలోని పందిల్లపల్లె సమీపంలో భైరవేశ్వరస్వామి గుడి వద్ద కారు, ఆటో ఢీ కొనడంతో మంగళవారం రాత్రి ఇద్దరు దుర్మరణం చెందారు. ఎర్రగుంట్ల వైపు వస్తున్న కారు, కడప నుంచి ఎర్రగుంట్లకు కడ్డీల లోడుతో వెళుతున్న ఆటో ఢీకొన్నాయి. కడపకు చెందిన ఆటో చోదకుడు షేక్ హసాన్(35), చిలమకూరుకు చెందిన ప్రతాప్‌రెడ్డి, వీఎన్‌పల్లె మండలం పాలగిరికి చెందిన దాసరి రవి కడప నుంచి ఆటోలో బయలుదేరారు. భైరవేశ్వరస్వామి గుడి వద్దకు రాగానే కారు, ఆటో ఢీకొన్నాయి. ప్రమాదంలో ఆటో చోదకుడు అక్కడికక్కడే మృతి చెందగా ప్రతాప్‌రెడ్డికి తీవ్ర గాయాలు కావడంతో ప్రొద్దుటూరులోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందారు. దాసరి రవికి గాయాలు కావడంతో కమలాపురంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఏఎస్సై వెంకటరమణ తమ సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు.

లారీ ఢీకొని యువకుడు..

కమలాపురం (వల్లూరు) : వల్లూరు మండలం ఈతచెట్టు వద్ద మంగళవారం ద్విచక్రవాహనాన్ని లారీ ఢీకొనడంతో ఓ యువకుడు అక్కడికక్కడే మృతి చెందారు. పాపఘ్నినగర్‌కు చెందిన జరిగాళ్ల బాబు(25) మంగళవారం రాత్రి సొంత పనిమీద వల్లూరుకు బయలుదేరారు. మార్గంమధ్యలో ప్రమాదవశాత్తు లారీ ఢీకొంది. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేశారు.

వాహనం ఢీకొని వృద్ధుడు

పోరుమామిళ్ల, న్యూస్‌టుడే: ఈదులపల్లె వద్ద బొలెరో వాహనం ఢీకొన్న ఘటనలో లక్కినేని ఓబన్న (80) మృతి చెందారని ఎస్సై కొండారెడ్డి తెలిపారు. కొమరోలు నుంచి పోరుమామిళ్లకు బొలెరో వాహనం వస్తుండగా ఈదులపల్లెకు చెందిన లక్కినేని ఓబన్న రహదారిపై నడుచుకుంటూ వెళ్తున్నారు. వెనుక వైపు నుంచి వచ్చిన వాహనం ఢీకొనడంతో తీవ్రంగా గాయపడిన ఆయనను తొలుత స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స అందించి అనంతరం కడప రిమ్స్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడని ఎస్సై తెలిపారు.

ప్రొద్దుటూరు

● ప్రొద్దుటూరు ● జమ్మలమడుగు ● బద్వేలు ● మైదుకూరు

న్యాయం చేయాలని వేడుకోలు

కడప, నేరవార్తలు, న్యూస్‌టుడే: తాను నిర్వహిస్తున్న బంగారం దుకాణంలో నగలు చోరీ కాగా ప్రొద్దుటూరులో పోలీసులు పట్టించుకోలేదనిఅక్కడి శ్రీనివాసనగర్‌వీధివాసి ఎస్‌.జిలానీబాషా కుటుంబం అదనపు ఎస్పీ ప్రకాష్‌బాబుకు వినతి పత్రాన్ని అందజేసింది. పార్వతి ఆర్కేడ్ కాంప్లెక్స్‌లో ఉన్న బంగారు దుకాణంలో ఆగస్టు 25వ తేదీ రాత్రి 309 గ్రాముల బంగారు ఆభరణాలు చోరీ అయ్యాయన్నారు. ఈ ఘటనకు సంబంధించి ప్రొద్దుటూరులో రెండో పట్టణ ఠాణాలో ఫిర్యాదు చేసేందుకు వెళితే తననే తప్పులు పడుతూ కేసు నమోదు చేయకుండా ఇబ్బంది పెడుతున్నారన్నారు.

పురపాలక ఇంజినీర్ల బదిలీలు

ప్రొద్దుటూరు పట్టణం: పురపాలక సంఘ కార్యాలయ ఇంజినీరింగ్ అధికారులు బదిలీ అయ్యారు. డీఈ వెంకటరమణను చిత్తూరుకు బదిలీ కాగా ఈయన స్థానంలో కడప పబ్లిక్ హెల్త్ విభాగ డీఈ యశోధ నియమితులయ్యారు. ఆళ్లగడ్డలో ఏఈగా పని చేస్తున్న సురేంద్రనాథరెడ్డి, ఉమామహేశ్వరిని జమ్మలమడుగుకు, కడప నుంచి దిల్‌షాద్‌ను ఇక్కడికి బదిలీ చేశారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి



వస్త్రాలతో తయారు చేసిన చేతి సంచులను చూపిస్తున్న మహిళలు

ప్రొద్దుటూరు పట్టణం, న్యూస్‌టుడే: పర్యావరణాన్ని పరిరక్షించేందుకు ప్రతి ఇంట్లోనూ ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలని కేంద్ర పర్యాటక శాఖ మేనేజర్ బ్రహ్మానందరెడ్డి తెలిపారు. కేంద్రప్రభుత్వ పర్యాటక మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో స్వయంసహాయక సంఘాల మహిళలకు స్థానిక మహిళా స్త్రీశక్తి భవనంలో రెండు రోజుల పాటు వస్త్ర సంచుల తయారీపై శిక్షణను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పర్యాటక శాఖ సహాయక మేనేజర్ చేతన్‌జాడర్, సిటీ మేనేజర్ కేజీయా, సీవోలు విమల, హేమలత, శ్రీవాణి, నాగలక్ష్మి, ఆర్‌పీలు పాల్గొన్నారు.

కడపలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయాలి

జమ్మలమడుగు, న్యూస్‌టుడే: విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను ఆపి, కడపలో ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు సునీల్ కుమార్ కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం స్థానిక ఎన్జీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ... కేంద్రంలో భాజపా మూడోసారి అధికారంలోకి వచ్చినా మన రాష్ట్రానికి సంబంధించి విభజన హామీలు అమలు చేయలేదని విమర్శించారు.

రెజ్లింగ్‌లో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

మైదుకూరు, న్యూస్‌టుడే : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో కడపలో నిర్వహిస్తున్న పోటీల్లో రెజ్లింగ్ అండర్-14 విభాగంలో మైదుకూరు ఉన్నత పాఠశాల విద్యార్థులు అయిదుగురు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. జిల్లా స్థాయిలో నిర్వహించిన పోటీలో ప్రతిభ కనపరిచిన ఇస్మాయిల్, కల్యాణ్, నవీన్‌కుమార్, రవితేజ, హసన్‌లు ఎంపికైనట్లు వ్యాయామ ఉపాధ్యాయురాళ్లు వినోనియారాణి, చంద్రావతి తెలిపారు. పాఠశాల నుంచి అయిదుగురు విద్యార్థులు ఎంపిక కావడంపై ప్రధానోపాధ్యాయుడు రామ్మోహన్ హర్షం వ్యక్తం చేశారు.

తపాలా ఖాతా పుస్తకాలు స్వాధీనం

కాశినాయన, న్యూస్‌టుడే: మండలంలోని నరసాపురం తపాలా శాఖలో నిధులు స్వాహా అయిన వివరాలున్న ప్రజల ఖాతాల పుస్తకాలను మంగళవారం అధికారులు స్వాధీనం చేసుకున్నారు. బ్రాంచ్ పోస్టుమాస్టర్ (బీపీఎం) తిరుమల నాయక్ ప్రజల పొదుపు ఖాతాల్లోని నగదు రూ.లక్షల్లో స్వాహా చేయడం, ఆ ఖాతా పుస్తకాలు కనిపించక కేసు మిస్టరీగా మారడం తెలిసిందే. బీపీఎం కనిపించకుండా పోవడంతో విచారణాధికారులకు ఆధారాలు లభ్యం కాలేదు. ఈక్రమంలో గ్రామంలోని మౌలాలీ అనే వ్యక్తి వద్ద 186 ఖాతా పుస్తకాలు ఉండడాన్ని తెలుసుకున్న తపాలా శాఖ అధికారులు వాటిని స్వాధీనం చేసుకున్నారు. వీటిని బద్వేలులోని ప్రధాన తపాలా శాఖకు పంపించామని బాధ్య బీపీఎం పేర్కొన్నారు.

ఫైరింగ్ పోటీలల్లో విజేత నాయబ్‌రసూల్



ప్రథమ బహుమతి అందుకుంటున్న విద్యార్థి నాయబ్‌రసూల్

బద్వేలు గ్రామీణ, న్యూస్‌టుడే: పట్టణంలోని ఫాతీమా ఆంగ్ల మాధ్యమ పాఠశాల ఎన్‌సీసీ విద్యార్థి ఎం.నాయబ్ రసూల్ కడపలోని 30వ ఆంధ్రా బెటాలియన్‌లో నిర్వహిస్తున్న సామూహిక వార్షిక శిబిరం-7లో పాల్గొని ఫైరింగ్‌లో పోటీపడ్డారు. జూనియర్ డివిజన్ విభాగంలో ప్రథమస్థానం సాధించినట్లు ప్రధానోపాధ్యాయురాలు జ్యోతిశ్య తెలిపారు. డ్రిల్, కల్చరల్ విభాగంలో గురుహర్షిత్, జె.రామ్‌చరణ్ విజేతలుగా నిలిచారన్నారు.

ఉపాధ్యాయులకు బకాయిలు చెల్లించాలి



ప్రసంగిస్తున్న ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు ఇలియాస్‌బాషా, నాయకులు

మైదుకూరు, న్యూస్‌టుడే : ఉద్యోగ ఉపాధ్యాయులకు పెండింగులో ఉన్న జడ్పీపీఎఫ్, ఏపీజీఎల్ఐ, సరెండర్‌లీవ్, మెడికల్ రీయంబర్స్‌మెంట్ వంటి బకాయిలను చెల్లించాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఇలియాస్‌బాషా, సంగమేశ్వరరెడ్డిలు డిమాండు చేశారు. మంగళవారం స్థానిక ఎంఈవో కార్యాలయ ఆవరణంలో రీజనల్ కన్వీనర్ కె.వెంకటేశ్వరరాజు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎస్టీయూ నాయకులు మాట్లాడుతూ బకాయిలను ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉంచడం అన్యాయమన్నారు. సకాలంలో సొమ్ము అందక అత్యవసర కార్యక్రమాలను వాయిదా వేసుకోవాల్సి వస్తోందని రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శివశంకర్, రమణారెడ్డి, రషీద్‌ఖాన్ అన్నారు. పాఠశాలలను నిర్వీర్యం చేసే 117జీవో రద్దు చేయాలని, సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను అమలు చేయాలన్నారు. సమావేశంలో ఎంఈవోలు పద్మలత, నరహరిశర్మ, సీపీఎస్ రాష్ట్ర కమిటీ కన్వీనర్ యు.సుబ్రమణ్యం, సంఘ నాయకులు పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యం

బద్వేలు గ్రామీణ, న్యూస్‌టుడే: గోపవరం మండలంలోని ఓ గ్రామానికి చెందిన వివాహిత (45) కనిపించడంలేదని ఫిర్యాదు అందిందని బద్వేలు గ్రామీణ ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. ఈ నెల 22వ తేదీ నుంచి కనిపించడం లేదన్నారు.

అర్ధరాత్రి పందుల తరలింపు

కొండాపురం, న్యూస్‌టుడే: కడప-తాడిపత్రి ప్రధాన రహదారిలోని కొండాపురం మీదుగా పందులను తరలించారు. ఈ వాహనాన్ని అడ్డుకోవడానికి స్థానికులు ప్రయత్నించినా ఆపకుండా వెళ్లిపోయారు. సోమవారం అర్ధరాత్రి సమయంలో ముద్దనూరు వైపు నుంచి కొండాపురం మీదుగా పందులను తరలించే వాహనం వెళ్తుండగా గండ్లూరు గ్రామ సమీపంలోని ప్రధాన రహదారిపై ఖాళీ నీటి డ్రమ్ములు ఉంచి ఆపడానికి పలువురు ప్రయత్నించారు. అయితే వాహనం ఆపకుండా అతి వేగంగా వెళ్లింది. వాహనంలో సుమారు ఎనిమిది మంది వ్యక్తులు ఉన్నట్లు దండ్లూరు గ్రామానికి చెందిన గిరిజన సమైక్య నాయకురాలు డేరా జ్యోతి తెలిపారు. ఈ ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ముద్దనూరు: మండల పరిధిలోని పెద్దదుద్యాల సమీపంలో పులివెందుల రోడ్డులో ఈనెల 17వ తేదీన ఆటో అదుపు తప్పి బోల్తా పడిన ప్రమాదంలో గాయపడిన కుచేరుపల్లి రాజా(45) చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్లు ఏఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. సింహాద్రిపురంకోవరంగుట్టుపల్లికు చెందిన రాజా సోదరుడు రమేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ తెలిపారు.

తప్పటడుగులు!

- ✦ నేర ప్రవృత్తిలో మైనర్లు, యువకులు
- ✦ జల్సాల కోసం... వ్యసనాల బాట
- ✦ తల్లిదండ్రుల పర్యవేక్షణ అవసరం




గంజాయి రవాణా కేసులో పోలీసులకు ఇటీవల చిక్కిన యువకులు

–న్యూస్‌టుడే, ప్రొద్దుటూరు నేరవార్తలు

బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాల్సిన యువకులు..నేరాల బాట పడుతున్నారు. పుస్తకాలు చేతపట్టి చదవాల్సిన మైనర్ బాలురు కత్తులు పడుతున్నారు. పెద్దల అడుగుజాడల్లో నడచి మంచి చెడులను తెలుసుకోవాల్సిన వారంతా తప్పటడుగులు వేస్తున్నారు. చెడు అలవాట్లను బానిసలుగా మారి పోలీస్ స్టేషన్, జైలు మెట్లు ఎక్కుతున్నారు. ఇటీవల జరుగుతున్న నేరాల ఘటనల్లో గతంలో ఎన్నడూ లేని విధంగా అధిక మంది యువకులు, మైనర్లు ఉండటం ఆందోళన కలిగిస్తోంది. పోలీసులు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నా మార్పు రావడం లేదు. ఇటీవల కాలంలో పిల్లలపై పర్యవేక్షణ తగ్గిపోతోంది. కొందరు తల్లిదండ్రులు అతిప్రేమ చూపిస్తున్నారు. కార్లు, బైక్‌లు, ఖరీదైన చరవాణులు కొనిపెడుతున్నారు. పర్యవేక్షణ పూర్తిగా గాలికొదిలేశారు. వారేంచెప్పినా గుడ్డిగా నమ్మేస్తున్నారు. గతంలో బాలలు, యువకులు ఏ చిన్న తప్పు చేసినా వారిని మందలించేవారు. ఆ తప్పులు మళ్లీ జరగకుండా హెచ్చరించేవారు. కానీ ప్రస్తుతం పరిస్థితి కనిపించడం లేదు. తప్పులు చేస్తున్నా యువకులను కొందరు వెనుకేసుకొస్తున్నారు. దీంతో తామేం చేసినా తల్లిదండ్రులు ఏమీ అనరన్న భావన వారిలో కలుగుతోంది. దీంతో సామాజిక మాధ్యమాల్లోని చెడును ఎక్కువగా అనుసరిస్తున్నారు. ఆన్‌లైన్ బెట్టింగ్‌లు ఆడుతూ అప్పులు చేస్తున్నారు. మద్యం, గంజాయి తీసుకుంటూ ఆ మత్తులో విచక్షణ కోల్పోయి గొడవలు, పలు రకాల నేరాలకు సైతం పాల్పడుతున్నారు. ప్రొద్దుటూరుతో పాటు జిల్లాలోని పలు ప్రాంతాల్లో అలాంటి ఘటనలు అనేకం చోటు చేసుకుంటున్నాయి.

పిల్లలపై తల్లిదండ్రుల దృష్టి అవసరం



సామాజిక మాధ్యమాల ప్రభావం, తల్లిదండ్రుల పర్యవేక్షణ లేకపోవడంతో యువకులు దురలవాట్లకు బానిసవుతున్నారు. వారికి తెలియకుండానే తప్పులు చేస్తున్నారు. వారిలో మార్పు తీసుకువచ్చేందుకు అవగాహన కల్పిస్తున్నాం. అవసరానికి మించి చరవాణులు, బైకులు కొనివ్వడంతో విలాసవంతమైన జీవితానికి అలవాటు పడుతున్నారు. ఆ క్రమంలో చెడు సాన్నిహిత్యం వల్ల పలురకాల వ్యసనాలకు అలవాటు నేరాల వైపు అడుగులు వేస్తున్నారు. ప్రధానంగా తల్లిదండ్రులు తమ పిల్లలు ఏం చేస్తున్నారన్న విషయంపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. **-భక్తవత్సలం, డీఎస్పీ, ప్రొద్దుటూరు**

కొన్ని ఉదాహరణలు

- ప్రొద్దుటూరులో గంజాయి ముఠాను అరెస్టు చేశారు. వారిలో అందరూ యువకులే ఉండటం గమనార్హం. సులువుగా డబ్బు సంపాదించాలన్న ఉద్దేశంతో ఓ యువకుడు విశాఖ నుంచి గంజాయి తెప్పించి విక్రయించడం అలవాటు చేసుకున్నాడు. మరికొందరిని సైతం ఆ వ్యసనంలోకి లాగాడు.
- ప్రొద్దుటూరు-థర్మల్ రోడ్డులో గంజాయి తాగుతున్న కొందరు యువకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పిల్లలపై నిఘా ఉంచాలని తల్లిదండ్రులకు సైతం చెప్పారు. ఆ యువకులు 20 ఏళ్లలోపు ఉన్నవారే.
- జల్సాలకు అలవాటు పడి చోరీలకు పాల్పడుతున్న కర్నూలు జిల్లాకు చెందిన ఓ యువకుడిని ప్రొద్దుటూరు పోలీసులు గతంలో అరెస్టు చేశారు. 9వ తరగతి చదువుకున్న అతను నేరాలకు అలవాటు పడ్డాడు. 2009 నుంచి కర్నూలు, నంద్యాల, ఆదోని, నందికొట్కూరు, గుంటూరు, ప్రొద్దుటూరు, తెలంగాణలోని పలు ప్రాంతాలతో పాటు కర్ణాటక రాష్ట్రంలోనూ చోరీలాకు పాల్పడినట్లు పోలీసులు గుర్తించారు.
- ప్రొద్దుటూరులో కొన్నిరోజుల క్రితం ఓ బాలుడు మత్తులో కత్తితో హల్‌చల్ చేశాడు. ఏకంగా ఓ ప్రభుత్వ పాఠశాలకు వెళ్లి అక్కడి ఉపాధ్యాయులపై దాడి చేసేందుకు యత్నించాడు. ఉపాధ్యాయులు ఫిర్యాదు చేయడంతో ఆ బాలుడికి కౌన్సెలింగ్ నిర్వహించారు.

ప్రణాళికతో శాశ్వత అభివృద్ధి

మైదుకూరు, న్యూస్‌టుడే : నియోజకవర్గాన్ని శాశ్వతంగా అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ అన్నారు. మంగళవారం కమిషనర్ శ్రీనివాసులరెడ్డి ఆధ్వర్యంలో స్థానిక వస్త్ర సముదాయంలో జరిగిన ప్రభుత్వ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడారు. ఎంపీగా ఉన్న తన కుమారుడు పుట్టా మహేష్‌యాదవ్ కృషితో మైదుకూరు నియోజకవర్గ అభివృద్ధికి మరో రూ.20 కోట్లు కేంద్రం నుంచి తెప్పించేందుకు కృషి చేస్తామన్నారు. మైదుకూరులో నిలువెత్తు కృష్ణదేవరాయులు, పొట్టిశ్రీరాములు, బీఆర్ అంబేడ్కర్ విగ్రహాలు, కూడలిలో ప్రొద్దుటూరులాగా జాతీయ పతాకం, విద్యుద్దీపాలు ఏర్పాటు చేయిస్తామన్నారు. ఇందుకు జిల్లా కలెక్టరు రూ.79 లక్షలు నిధులు మంజూరు చేశారని జనవరి నాటికి పూర్తి చేస్తామన్నారు. సిమెంట్ రోడ్లు, మురుగుకాలువలకు రూ.200 కోట్లు నుంచి రూ.300 కోట్లు అవసరం అవుతుందన్నారు. ప్రజల తాగు, సాగునీటి అవసరాలను దృష్టిలో పెట్టుకుని ఎల్లంపల్లె చెరువు నిండాక ఖాజీపేట మండలం కన్నెలవాగు చెరువు నింపుతామన్నారు.

తాగునీరు, విద్యుత్తు సమస్యలు పరిష్కరించాలి

ఎర్రగుంట్ల, న్యూస్‌టుడే: తాగునీరు, విద్యుత్తు సమస్యలకు ప్రథమ ప్రాధాన్యమిచ్చి సత్వరం పరిష్కరించాలని ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి తెలిపారు. మంగళవారం ఎర్రగుంట్ల నగరపంచాయతీ కార్యాలయంలో ఛైర్మన్ హర్షవర్ధన్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. పట్టణంలో మెరుగైన విద్యుత్తు అందించుటకు నూతనంగా మరికొన్ని సబ్‌స్టేషన్లను ఏర్పాటు చేయబోతున్నట్లు తెలిపారు. అనంతరం బదిలీపై వెళ్తున్న ఎర్రగుంట్ల నగర పంచాయతీ కమిషనర్ రామకృష్ణయ్యను ఎమ్మెల్యేతోపాటు నూతన కమిషనర్ శేషఫణి ఘనంగా సత్కరించారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వ పాలన



ప్రొద్దుటూరులో ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వరదరాజులురెడ్డి, నాయకుడు సురేష్‌నాయుడు తదితరులు

సంక్షోభంలోనూ సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తూ మొదటి 100 రోజుల్లోనే ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ప్రజలచే మంచి ప్రభుత్వంగా పేరొందిందని ప్రజాప్రతినిధులు పేర్కొన్నారు. 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా మంగళవారం ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, బద్వేలు, మైదుకూరు నియోజకవర్గ మండలాల్లో ప్రజా వేదిక సభ నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, ఎన్డీయే కూటమి నాయకులు హాజరై మాట్లాడారు. పింఛన్ల పెంపు, మెగా డీఎస్సీ, ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు వంటి వాటిపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కీలక నిర్ణయాలు తీసుకున్నారని తెలిపారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి నూరు శాతం పంచాయతీలు, ఎంపీటీసీలు, ఎంపీపీలు, జడ్పీటీసీ స్థానాలను గెలిచి ప్రతిపక్షాన్ని నామరూపాలు లేకుండా చేయాలన్నారు. సభలో పాల్గొన్న గ్రామస్థులు పలు సమస్యలను విన్నవించగా వెంటనే పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ప్రజాప్రతినిధులు ఆదేశించారు.

-న్యూస్‌టుడే, ప్రొద్దుటూరు వైద్యం, పోరుమామిళ్ల, మైదుకూరు, కొండాపురం, ఖాజీపేట



పోరుమామిళ్లలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి, పక్కన తెదేపా బద్వేలు నియోజకవర్గ సమన్వయకర్త రితేష్‌రెడ్డి



కొండాపురంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, తెదేపా బాధ్యుడు భూపేష్‌రెడ్డి, తదితరులు



మైదుకూరు సభలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్

ఉపాధి హామీ సిబ్బంది పనితీరుపై ఆగ్రహం

రాజుపాళెం, న్యూస్‌టుడే: ఉపాధి హామీ సిబ్బంది పనితీరు సక్రమంగా లేదని డ్వామా అదనపు పీడీ నాగరత్నమ్మ ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం రాజుపాళెంలోని ఉపాధి హామీ కార్యాలయం వద్ద 18వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదిక సమావేశాన్ని ఎంపీడీవో షాకీర్ అలీఖాన్ అధ్యక్షతన జరిగింది. గత ఏడాది రూ.7.30 కోట్ల విలువైన పనులు చేశారని తెలిపారు. మేట్ పనితీరు బాగాలేదని రూ.3000 జరిమానా విధించారు. పనుల్లో రూ.2.09 లక్షలు వ్యత్యాసం ఉందని సవరణ చేయాలన్నారు. ఏపీడీ ఆర్.రామలింగేశ్వరరెడ్డి, ఏపీవోలు లక్ష్మీనారాయణ, గంగయ్య, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డ్వామా అదనపు పీడీ నాగరత్నం, పక్కన అధికారులు

పంట నమోదుతోనే ప్రయోజనాలు



మాట్లాడుతున్న వ్యవసాయశాఖ ఏడీఏ సురేష్‌రెడ్డి

ప్రతి రైతు సాగు చేసిన పంటను రైతుసేవా కేంద్రంలో నమోదు చేసుకుంటే ప్రభుత్వం నుంచి అనేక ప్రయోజనాలు కలుగుతాయని వ్యవసాయాధికారులు అన్నారు. మంగళవారం ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, మైదుకూరు, బద్వేలు నియోజకవర్గ మండలాల్లో 'పొలం బడి పిలుస్తోంది' కార్యక్రమాలను నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, సిబ్బంది, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు హాజరయ్యారు. వారు మాట్లాడుతూ ఆధునిక వ్యవసాయ పద్ధతులతో చీడ, పీడలు, తెగుళ్లను తక్కువ ఖర్చుతో నివారించవచ్చునని సూచించారు. వ్యవసాయంలో నష్టాలతో అలసిపోయిన రైతులను ప్రోత్సహించేందుకే ప్రభుత్వం ఈ కార్యక్రమం చేపట్టిందన్నారు. **-న్యూస్‌టుడే, ప్రొద్దుటూరు, పెద్దముడియం, రాజుపాళెం, ముద్దనూరు, కలసపాడు**

ఉద్యోగోన్నతి కల్పించాలని వినతి

ప్రొద్దుటూరు పట్టణం, న్యూస్‌టుడే: వార్డు సచివాలయ పరిపాలన కార్యదర్శులకు ఉద్యోగోన్నతిలో ప్రాధాన్యమివ్వాలని డిమాండ్ చేస్తూ వార్డు పరిపాలన కార్యదర్శుల జిల్లా సంఘం అధ్యక్షుడు శివశంకర్, సునీల్‌లు రాష్ట్ర రవాణాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డికి వినతిపత్రాన్ని అందజేశారు. మంగళవారం సాయంత్రం మంత్రి పట్టణానికి విచ్చేసిన సందర్భంగా పరిపాలన కార్యదర్శులు మంత్రికి ఇచ్చిన వినతిపత్రంలో సచివాలయం పునర్వ్యవస్థీకరణ చేసే పరిస్థితిలో ఉంటే తమకే ప్రాధాన్యమివ్వాలని కోరారు.

మద్యం దుకాణం వద్దని మహిళల నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న మహిళలు

ప్రొద్దుటూరు పట్టణం: ప్రొద్దుటూరు పట్టణం మైదుకూరు రోడ్డు నుంచి శ్రీనివాసనగర్‌కు వెళ్లే వాస్తు కాంప్లెక్స్ సమీపంలో మద్యం దుకాణాన్ని ఏర్పాటు చేయవద్దని ఆ ప్రాంత మహిళలు నిరసన వ్యక్తం చేశారు. మంగళవారం మహిళలు మాట్లాడుతూ 7,8,9,14,15 వార్డులకు వెళ్లే మార్గంలో మహిళలు, విద్యార్థినులు ఈ మార్గంలో వెళ్లడం ఇబ్బందిగా ఉందన్నారు. మసీదుకు వెళ్లాలన్నా మందుబాబులతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. పురపాలక కౌన్సిల్ సమావేశంలోనూ కౌన్సిలర్లు ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లారన్నారు. రోడ్డుపైనే కూర్చొని మద్యం తాగడం వలన తాము ఇబ్బందులు పడుతున్నామన్నారు.

అన్నదాత సుఖీభవ

జమ్మలమడుగులో అన్న క్యాంటీన్‌కు విశేష స్పందన



జమ్మలమడుగు : వరుసలో నిల్చున్న ప్రజలు

–న్యూస్‌టుడే, జమ్మలమడుగు

పేదల ఆకలి తీర్చే అన్న క్యాంటీన్‌కు జమ్మలమడుగులో విశేష స్పందన వస్తోంది. పేదలతోపాటు ప్రయాణికులకు ఈ క్యాంటీన్ కడుపునిండా భోజనం అందిస్తోంది. ఈ నెల 19వ తేదీ సాయంత్రం స్థానిక తాడిపత్రి బస్టాప్‌లో అన్న క్యాంటీన్‌ను పునఃప్రారంభించారు. గతంలో తెదేపా ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు మూడు పూటలా ఆరోగ్యకరమైన పోషకాహారాన్ని అందించారు. తర్వాత వైకాపా ప్రభుత్వంలో ఈ క్యాంటీన్ సచివాలయంగా మారిపోయింది. ఎన్నికలకు ముందు తెదేపా అధినేత చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు క్యాంటీన్ పునఃప్రారంభం కావడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

✶ జమ్మలమడుగులోని తాడిపత్రి బస్టాప్‌లోని అన్న క్యాంటీన్‌లో ప్రతి రోజు ఉదయం అల్పాహారం 350, మధ్యాహ్న భోజనం 500, రాత్రి భోజనం 200 మందికి అందిస్తున్నారు. హరే కృష్ణ మూమెంట్ చారిటబుల్ ట్రస్టు ఫౌండేషన్ సౌజన్యంతో కూటమి ప్రభుత్వం పేదల ఆకలి తీరుస్తోంది. తొమ్మిది మంది సిబ్బంది పని చేస్తున్నారు. కడప మార్కెట్‌యార్డులో తయారు చేసిన ఆహారాన్ని జమ్మలమడుగుకు తీసుకొస్తారు. అల్పాహారం ఉదయం 7.30 గంటల నుంచి 10 వరకు మధ్యాహ్నం భోజనం 12.30 నుంచి 3 గంటలకు, రాత్రి 7.30 నుంచి 9 గంటల వరకు క్యాంటీన్ అందుబాటులో ఉంటుంది. ఆదివారం మాత్రం సెలవు దినం ఆ రోజు పనిచేయదు. జమ్మలమడుగులో ప్రభుత్వ ఆసుపత్రికి సమీపంలో, పట్టణ నడి బొడ్డున ఉన్నందున రోగుల బంధువులతో పాటు ప్రయాణికులు, పేదలు, దినసరి కూలీలు, కార్మికులు క్యాంటీన్‌ను ఆశ్రయిస్తున్నారు. మూడు పూటలా అన్నార్తులు క్యాంటీన్ ఎదుట బారులు తీరుతున్నారు. టోకెన్లు పూర్తయ్యేంత వరకు ప్రజలకు ఆహారాన్ని అందిస్తున్నట్లు నిర్వాహకుడు గురుస్వామి తెలిపారు.

కడుపు నిండా భోజనం



కేవలం రూ.5కే రుచికరమైన భోజనం వడ్డిస్తున్నారు. మాలాంటి పేదలకు ఇది చాలా ఉపయోగకరం. చుట్టుపక్కల పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నాను. మధ్యలో ఇంటికి వెళ్లి భోజనం చేసి రావడం కష్టంగా ఉండేది. ఇప్పుడు ఆ సమస్య తీరింది. **-హుసేనమ్మ, జమ్మలమడుగు**

బయట రూ.100 వెచ్చించాలి



మాది మైలవరం మండలం పని నిమిత్తం కుటుంబ సభ్యులతో కలిసి జమ్మలమడుగుకు వచ్చాం. పని ఇంకా పూర్తి కాలేదు. ఈ లోగా అన్న క్యాంటీన్‌లో వచ్చి భోజనం చేశాం. అదే బయట హోటల్‌కు వెళ్లాలంటే రూ.వంద వరకు ఖర్చు అవుతుంది. **-లక్ష్మీ, పొన్నంపల్లె, మైలవరం మండలం**

IN THE COURT OF THE SENIOR CIVIL JUDGE, PRODDATUR

I.P.No. 8 /2024

Govindu Ravi Prasad, S/o Govindu Ramaiah, Uruturu (Vi), Veerapunayunipalli (ML), Kadapa District.

- Petitioner / Debtor

Vs

1. Kalluru Obula Reddy, Son of Lakshmi Reddy, D.No.2/5A, Thurpu Veedhi, Uruturu (Vi), Veerapunayunipalli (ML), Kadapa District, **2.** Kalluru Chandra Obula Reddy, Son of Obula Reddy, D.No.2/5C, Thurpu Veedhi Uruturu (Vi), Veerapunayunipalli (ML), Kadapa District, **3.** Kalluru Gangi Reddy, Son of Rami Reddy, D.No.2/6, Thurpu Veedhi, Uruturu (Vi), Veerapunayunipalli (ML), Kadapa District, **4.** Kalluru Narasimha Reddy, Son of Lakshmi Reddy, D.No.2/9, Thurpu Veedhi, Uruturu (Vi), Veerapunayunipalli (ML), Kadapa District, **5.** Kalluru Kishore Kumar Reddy, Son of Obula Reddy, Residing at D.No.2/11, Thurpu Veedhi, Uruturu (Vi), Veerapunayunipalli (ML), Kadapa District, **6.** Yeddula Venakata Rami Reddy, Son of Pedda Gangi Reddy, D.No.3/47, Thurpu Veedhi, Uruturu (Vi), Veerapunayunipalli (ML), Kadapa District, **7.** Kothapu Prathap Reddy, Son of Singa Reddy, D.No.3/45, Patimeeda, Uruturu (Vi), Veerapunayunipalli (ML), Kadapa District, **8.** Kothapu Bharathamma, Wife of Gangi Reddy, D.No.3/43, Thurpu Veedhi, Uruturu (Vi), Veerapunayunipalli (ML), Kadapa District, **9.** Kothapu Chinna Gangi Reddy, Son of Bali Reddy, D.No.2/31, Patimeeda, Near Buruju, Uruturu (Vi), Veerapunayunipalli (ML), Kadapa District, **10.** Yarramreddy Muni Sekhar Reddy, Son of Venkata Reddy, D.No.2/29, Patimeeda, Uruturu (Vi), Veerapunayunipalli (ML), Kadapa District, **11.** Annavaram Sudha Rani, Wife of A.Venkata Reddy, D.No.2/43, Thurpu Veedhi, Near Buruju, Uruturu (Vi), Veerapunayunipalli (ML), Kadapa District, **12.** Muthukuru Sidda Reddy, Son of Gangi Reddy, D.No.3/20, Near Buruju, Uruturu (Vi), Veerapunayunipalli (ML), Y.S.R.Kadapa District, **13.** Sanivarapu Rama Chandra Reddy, Son of Yerrapu Reddy, Residing at D.No.2/48, Thurpu Veedhi, Uruturu (Vi), Veerapunayunipalli (ML), Kadapa District, **14.** Sanivarapu Kiran Kumar Reddy, Son of Lakshmi Reddy, Residing at D.No.2/50, Pakka Sandulo, Uruturu (Vi), Veerapunayunipalli (ML), Kadapa District, **15.** Sanivarapu Pavan Kumar Reddy, Son of Srirami Reddy, D.No.2/52, Pati meeda, Uruturu (Vi), Veerapunayunipalli (ML), Kadapa District, **16.** Sanivarapu Ramanjaneya Reddy, Son of Chinna Yarrapu Reddy, D.No.2/54, Thurpu Veedhi, Uruturu (Vi), Veerapunayunipalli (ML), Kadapa District, **17.** Bandaru Venkata Ramana, Son of Bayanna, Residing at D.No.2/57, Near Burju, Uruturu (Vi), Veerapunayunipalli (ML), Kadapa District, **18.** Bandaru Muni Swamy, Son of Bayanna, D.No.2/39, Pati meeda, Uruturu (Vi), Veerapunayunipalli (ML), Kadapa District, **19.** Muthukuru Samba Siva Reddy, Son of Nagi Reddy, D.No.2/24, Near Burju, Uruturu (Vi), Veerapunayunipalli (ML), Kadapa District, **20.** Shaik Sattar, Son of Mabhu Saheb, D.No.2/49, Thurpu Veedhi, Uruturu (Vi), Veerapunayunipalli (ML), Kadapa District, **21.** Gajjala Madan Mohan Reddy, Son of Rami Reddy, D.No.3/55, Near Burju, Uruturu (Vi), Veerapunayunipalli (ML), Kadapa District, **22.** Karedla Kittaiah, Son of Veeranna, D.No.3/60, Patimeeda, Uruturu (Vi), Veerapunayunipalli (ML), Kadapa District, **23.** Shaik Rajapa, son of Abdulla, D.No.2/50, Near Burju, Uruturu (Vi), Veerapunayunipalli (ML), Kadapa District. **24.** Yerra Pullaiah, Son of Yerra Venkatesu, aged about 73 years, Hindu, Cultivation, Residing at D.No.3/67, Thurpu Veedhi, Uruturu (Vi), Veerapunayunipalli (ML), Kadapa District, **25.** Pandillapalle Chandrayudu, Son of Pandillapalle Ramudu, Residing at D.No.3/80, Patimeeda, Uruturu (Vi), Veerapunayunipalli (ML), Kadapa District, **26.** Shaik Imam Basha, Son of Nadipi Imamulu, D.No.2/82, Patimeeda, Uruturu (Vi), Veerapunayunipalli (ML), Kadapa District.. **28.** Yaramala Chenna Kesava Reddy, Son of Yaramala Eswar Reddy, D.No.2/87, Burju Street, Uruturu (Vi), Veerapunayunipalli (ML), Kadapa District, Yaramala Narayana Reddy, Son of Yaramala Chenna Reddy, D.no.2/89, Thurpu Veedhi Uruturu (Vi), Veerapunayunipalli (ML), Kadapa District,. **29.** Palla Rama Mohan, Son of Palla Ramaiah, D.No.3/81, Patimeeda, Uruturu (Vi), Veerapunayunipalli (ML), Kadapa District.. **30.** Ganjikunta Venkata Ramana, Son of Gangikunta Singhanna, D.No.3/88, Pedanapadu (Vi), Yerraguntla (ML), Kadapa District, **31.** Alamuru Venkata Reddy, Son of Alamuru Subba Reddy, D.No.2/66, Pedanapadu (Vi), Yerraguntla (ML), Kadapa District, **32.** Mallu Gangi Reddy, Son of Mallu Narayana Reddy, D.No.3/89, Pedanapadu (Vi), Yerraguntla (ML), Kadapa District, **33.** Rachagolla Ravi, Son of Rachagolla Venkatanna, D.No.2/90, Venkatapuram (Vi), Veerapunayunipalle (ML), Kadapa District, **34.** Racha Golla Venkatesh, Son of Venkatanna, D.No.2/94, Venkatapuram (Vi), Veerapunayunipalle (ML), Kadapa District, **35.** Rachagolla Venkata Ramana, Son of Racha Golla Venkatanna, D.No.3/90, Venkatapuram (Vi), Veerapunayunipalle (ML), Kadapa District, **36.** Yalamkuru Rama Mohan Reddy, Son of Yalamkuru Bala Obula Reddy, Yalamkur (Vi), Veerapunayunipalle (ML), Kadapa District , **37.** Nookaboina Obaiah, Son of Nookaboina Obanna alias Bullenna, D.No.3/91, Venkatapuram (Vi), Veerapunayunipalle (ML), Kadapa District, **38.** Chanda Siva Reddy, Son of Chanda Gangi Reddy, D.No.3/93, Maheswar Nagar, Yerraguntla (Vi), Yerraguntla (ML), Kadapa District, **39.** Sanivarapu Ramanjaneya Reddy, Son of Sanivarapu Sanjeeva Reddy, D.No.2/93, Burju Street, Uruturu (Vi), Veerapunayunipalli (ML), Kadapa District, **40.** N.Obulesu, Father's name not known, D.No.2/44, Basireddypalle (Vi), Veerapunayunipalle (ML), Kadapa District,. **41.** Pullaiahgari Rama Narasimha Reddy, Son of Pullaiahgari Rama Krishna Reddy, D.No. 3/36, Ramireddy palle (Vi), Vempalle (ML), Kadapa District, **42.** Showreelu, Daughter of Rama Murthi Reddy, D.No. 30/205, Raja Vihar Road, Kurnool City and District, **43.** Narala Tirupathi Reddy, Son of Narala Bali Reddy, D.No.3/49, Bollavaram, Proddatur Town, Kadapa District,. **44.** R.Bala Gangi Reddy, Son of R.Bali Reddy, D.No.3/22, Ganganapalle (Vi), Thondur (ML), Kadapa District, **45.** Shaik Ramthulla @ Andhra Soda, Son of Mabhu Saheb, D.No.3/28, Pati meeda, Uruturu (Vi), Veerapunayunipalli (ML), Kadapa District,. **46.** Pullagura Sudhakar, Son of Venkata Ramaiah, D.No.3/51, Venkatapuram (Vi), Veerapunayunipalli (ML), Kadapa District, **47.** Yeddula Maheswara Reddy, Son of Yeddula Bala Gangi Redy, D.No.3/33, Gollalaguduru (Vi), Vemula (ML), Kadapa Dist. **48.** Kalluru Gangamma, Wife of Kalluru Obula Reddy, Door No.2/5-A, Uruturu (Vi), Veerapunayunipalle (ML), Kadapa District, **49.** Perla Venkata Rami Reddy, Son of Perla Rama Krishna Reddy, D.No.29, V.Kothapalle (Vi), Vemula (ML), Kadapa Dist. **50.** Vasudeva Reddy, Father's name not known , D.No.3/39, Turpu Street, Uruturu (Vi), Veerapunayunipalle (ML), Kadapa Dist. **51.** Doola Chinna Pullaiah, Son of Sikhamani, aged 46 years, Hindu, Business, Residing at D.No.2/155, Chowtapalli (Vi), Proddatur (ML), Kadapa District. **52.** N.Nagendra, Son of Subbarayudu, D.No.26/2018, Municipality Quarters, Proddatur Town, Kadapa District,. **53.** Talari Ramesh, Son of Pedda Pullaiah @ Abraham, D.No. 27/196, Vasanthapeta, Proddatur Town, Kadapa District., All are belongs to Kadapa Dist.,

- Respondents / R1 to R53

పబ్లిక్ నోటీసు

పై తెలిపిన పిటీషనరు తనను ఇన్‌సాల్వెంట్‌గా డిక్లేర్ చేయమని కోరుచూ రాజశ్రీ ప్రొద్దుటూరు సీనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో ఐ.పి.నెం. 8/2024గా పిటీషన్‌ను దాఖలు చేసి ఉన్నాడు. గనుక రెస్పాండెంట్స్ అయిన మీకు ఏవైన ఆక్షేపణలు ఉన్నయెడల పై కోర్టు వారి ఎదుట 25-09-2024వ తేదీన ఉదయం 10.30 గంటలకు హాజరై ఆక్షేపణలు తెలుపుకోవలెను. లేనంతట మీ పరోక్షము నందు తీర్మానించబడును.

వాయిదా తేదీ : 25-09-2024

Sd/- **G.Rajesh Reddy**
B.A, LL.B.,
Advocate, Proddatur.

కడప

• కడప • పులివెందుల • కమలాపురం

కూటమి ప్రభుత్వంతోనే సంక్షేమ పాలన

పులివెందుల (వేంపల్లె), న్యూస్‌టుడే: సమాజంలోని అన్ని వర్గాల సంక్షేమం కోసం పాటుపడే ప్రభుత్వానికి అండగా ఉండా లని ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి కోరారు. ప్రధాన కూడ ళ్లలో ఉపాధ్యాయులు, విశ్రాంత ఉద్యోగులను మంగళవారం కలి శారు. వందరోజుల కూటమి ప్రభుత్వపాలనపై వారితో ఆరా తీశారు. ఎన్నికల్లో ఉద్యోగులకు ఇచ్చిన హామీమేరకు ప్రతినెలా 1వతేదీ జీతాలు ఇస్తున్నామని మిగతా సమస్యలు పరిష్కారానికి కృషిచేస్తామని ఎమ్మెల్సీ హామీ ఇచ్చారు.



పులివెందులలో ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి

విద్యార్థులు సేవాభావం పెంపొందించుకోవాలి

వేంపల్లె: ట్రిపుల్‌ఐటీ విద్యార్థులు సేవాభావాన్ని పెంపొందించుకో వాలని డైరెక్టర్ కుమారస్వామిగుప్త పేర్కొన్నారు. జాతీయ సేవాప థకం దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ట్రిపుల్‌ఐటీలో 15 ఎన్ఎస్ఎస్ విభాగాలున్నాయని విద్యార్థులు గ్రామాలను దత్తత తీసుకొని సేవా కార్యక్రమాలను చేప డుతున్నారన్నారు. విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి, విజే తలకు బహుమతులు పంపిణీ చేశారు. ఏవో డా.రవికుమార్, అకడ మిక్ డీన్ రత్నకుమార్, ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త మధుసూదన్, పీఆర్వో తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.



విజేతలకు ధ్రువపత్రాలు, జ్ఞాపికలు అందజేస్తున్న డైరెక్టర్ కుమారస్వామిగుప్త

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM to 1 PM)
కడప : 8008573428, 8688701384
పులివెందుల : 8008573466
కమలాపురం : 8008573475

స్పందనకు వందనం

తొండూరు, న్యూస్‌టుడే: తొండూరులోని ప్రధాన రహ దారి నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు వీధి దీపాలు వెలగడం లేదని ఈనాడులో కథనం ప్రచురితమైంది. స్పందించిన పంచాయతీ అధికారి సాయికుమార్‌రెడ్డి సిబ్బందితో మరమ్మతులు చేయించారు.

వేముల: గొల్లలగూడూరులోని వీధుల్లో ప్రవహిస్తున్న మురుగును మంగళవారం తొలగించారు. ఐటీవలి గ్రామంలో నెలకొన్న మురుగు సమస్యపై ఈనాడులో సమస్య ప్రచురితమైంది. స్పందించిన అధికారులు మురుగు తొలగింపునకు చర్యలు చేపట్టారు.

చక్రాయపేట: మండల కేంద్రంలోని ఆపువారిపల్లెలో రెండు వీధి దీపాలు వెలగడం లేదని 'ఈనాడు'లో సమస్య ప్రచురితమైంది. స్పందిం చిన ట్రాన్స్‌కో ఏఈ ప్రవీణ్‌కుమార్ తమ సిబ్బందితో వీధి దీపాలకు మర మ్మతులు చేయించారు.

కమలాపురం: పట్టణంలోని తాగు నీటి వర్షాన్ని కుమ్మరి వీధిలో చెత్త కిందపడి దుర్వాసన వ్యాపిస్తోందని 'ఈనాడు'లో సమస్య ప్రచురిత మైంది. స్పందించిన శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ షపుల్లా పారిశుద్ధ్య కార్మికు లను పంపించి చెత్తను తొలగించి శుభ్రం చేయించారు.

లింగాల: కర్ణపాపాయపల్లె సిమెంటు రోడ్డుపై నీరు వృథాగా పోతుం దని 'ఈనాడు'లో కథనం ప్రచురితమైంది. స్పందించిన ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శివారెడ్డి సమీప ట్యాంకు నిండగానే నీటి సరఫరా నిలిపి వేయడానికి చర్యలు చేపట్టారు.

సిద్దవటం : సిద్దవటంలోని గాండ్లపాలెం పెన్నానదిలో ఇసుక అక్రమ రవాణా జరగకుండా మంగళవారం సిద్దవటం ఎస్సై చిరంజీవి చర్యలు తీసుకున్నారు. ఇసుక అక్రమ రవాణాపై ఈనాడులో 'తవ్వేసి...దోచేసి' అనే కథనం మంగళవారం ప్రచురితం కావడంతో ఎస్సై చిరంజీవి స్పందించారు. గాండ్లపాలెంలోని పెన్నాలోకి వాహనాలు వెళ్లకుండా రోడ్డుపై యంత్రంతో గుంత తీసి అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేశారు.

గ్రామీణ రహదారులు... అడుగడుగునా గోతులు



అధ్వానంగా వెల్లటూరుకు వెళ్లే రహదారి

చింతకొమ్మదిన్నె, న్యూస్‌టుడే : గ్రామీణ రహదా రుల దుస్థితి అధ్వానంగా మారింది. అడుగుకో గుంత ఉండటంతో వాహనదారులు తీవ్ర ఇబ్బం దులు పడుతున్నారు. గుంతలతో పాటు రోడ్లపై కంకర తేలడంతో ప్రజలకు రవాణా కష్టాలు తప్పడం లేదు. గత అయిదేళ్లలో వైకాపా ప్రభుత్వం రోడ్ల మరమ్మతులు పట్టించుకోలేదు. దీంతో రాత్రి వేళల్లో వాహనదారులు గుంతల కారణంగా ప్రమాదాల బారినపడుతున్నారు. కమలాపురం, పులివెందుల నియోజకవర్గాల్లోని పలు రహదారులు అధ్వా నంగా మారాయి. సీకేదిన్నె నుంచి పెండ్లిమర్రి మండలంలోని వెల్లటూరు వరకు దాదాపు 15 కిలోమీటర్ల మేర రహదారి గుంతలమయమైంది. పొలాల క్షేత్రానికి ఈ మార్గం మీదుగానే వెళ్లాల్సి ఉండటంతో నిత్యం వందలాది వాహ నాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఈ మార్గం లోని బుసిరెడ్డిపల్లె, అప్పరాజుపల్లె, గొర్లపల్లె, కె.ఓబులంపల్లె, గొర్లపల్లె వాగుల వద్ద రోడ్డు దెబ్బతినడంతో పాటు కంకర తేలింది. ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. సీకేదిన్నె పరిధి లోని కొప్పర్తికి వెళ్లే రహదారి దుస్థితి దారుణంగా ఉంది. ఈ రోడ్డుపై ప్రయాణించాలంటే ప్రజలు నిత్యం ఇబ్బందులు పడుతున్నారు. వలయ రహదా రిలోని మామిళ్లపల్లె వద్ద రోడ్డుకు మధ్యలో పెద్ద గుంత పడింది. ఈ గుంత పూడ్చకపోడంతో రాత్రి వేళల్లో వాహనాలు వేగంగా వచ్చి ప్రమాదాల బారి నపడుతున్నారు. తరచూ ఈ ప్రాంతంలో ప్రమా దాలు చోటు చేసుకుంటున్నా అధికారులు పట్టించు కోవడం లేదు. ఈ విషయమై రోడ్లు భవనాల శాఖ ఏఈ సునీల్‌ను వివరణ కోరగా.. రోడ్ల మరమ్మతు లకు నిధులు విడుదలవుతున్నాయి. టెండర్లు పిలిచి పనులు ప్రారంభిస్తామన్నారు.

ప్రమాదాల బారిన పడుతున్నాం



సీకేదిన్నె మండలంలోని గొర్లపల్లె వద్ద రోడ్డు దారు ణంగా ఉంది. దాదాపు అర కిమీ మేర మొత్తం కంకర తేలింది. ఈ మార్గంలో ప్రయా ణించాలంటే ఇబ్బందులు పడు తున్నాం. అధికారులు చర్యలు తీసుకుని మరమ్మ తులు చేయించాలి. - బాలిరెడ్డి, గొర్లపల్లె

పందుల చోరీకి విఫలయత్నం

లింగాల, న్యూస్‌టుడే: కొండాపురంలో అయిదుగురు దొంగలు పందులను సోమవారం రాత్రి చోరీ చేయడానికి విఫలయత్నం చేశారు. కాపరులు అప్రమత్తం కావడంతో పరారయ్యారు. కొండా పురం పోలీసులు ఈ విషయాన్ని సింహాద్రిపురం పోలీసులకు చేర వేశారు. ఇక్కడి పోలీసులు గాలింపు చర్యలు చేపట్టగా అడ్డదారిలో లింగాల మండలం పార్నపల్లె చెక్‌పోస్టు మీదుగా పరారవుతున్నా రని గుర్తించి అక్కడి పోలీసులకు సమాచారమిచ్చారు. మంగళ వారం వేకుజామున అనంతపురం మీదుగా చెక్‌పోస్టు దాటే ప్రయ త్నంలో పోలీసులు అప్రమత్తమై గేట్లు అడ్డుపెట్టారు. వాహనాన్ని వెనక్కి తిప్పి పరారవుతుండగా పోలీసులు వెంబడించడంతో రాళ్లు రువ్వి పార్నపల్లె వరకు వెనక్కి వచ్చి కోమన్నూతల మీదుగావెళ్లా రని ప్రత్యక్షసాక్షులు చెబుతున్నారు. అయిదుగురు దొంగలు 20 ఏళ్లలోపు యువకులని చెబుతున్నారు. ఎస్సై మధుసూదనరావు ఆధ్వర్యంలో పార్నపల్లెలోని వ్యాపార సముదాయాల్లోని సీసీ కెమె రాల్లో దొంగల కదలికలను పరిశీలిస్తున్నారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

కమలాపురం: పట్టణంలోని గాంధీనగర్‌కు చెందిన ఇరుగుడి చిన్నబాబు(40) అనే వ్యక్తి మంగళవారం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. కుటుంబ సభ్యులు స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో కడప సామాజిక ఆసుపత్రికి తరలించారు. ఆత్మహత్యాయత్నానికి కారణాలు తెలియరాలేదని పోలీసులు తెలిపారు.

వైకాపా, తెదేపా నాయకుల వాగ్వాదం

ఒంటిమిట్ట, న్యూస్‌టుడే : మండలంలోని కొండమాచుపల్లె పంచాయతీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో తెదేపా, వైకాపా వర్గీయుల మధ్య గొడవ జరిగింది. మండల ప్రత్యేకాధికారిణి శాంతమ్మ, ఎంపీడీవో రెడ్డెయ్య పర్యవేక్షణలో ఈవోపీర్డీ కుమార రంగయ్య అక్కడికి వచ్చిన వారితో ప్రతిజ్ఞ చేయిస్తుండగా వైకాపాకు చెందిన సర్పంచి మేరువ శివ నారాయణ సమావేశ వేదికపైన ఉంటూ అధికారు లను అనుసరించలేదు. ఈ విషయంపై రాజంపేట పార్లమెంటు పద్మశాలి సాధికార సమితి అధ్యక్షుడు ఆలూరి వెంకటసుబ్బయ్య ప్రశ్నించారు. ప్రభుత్వ కార్యక్రమంలో పాల్గొని ఎందుకు ప్రతిజ్ఞ చేయలేదని సర్పంచిని నిలదీశారు. అధికారుల సమక్షంలోనే రెండు పార్టీల నాయకుల మధ్య వాగ్వాదం చోటుచేసుకొంది. ఇరు పార్టీల వర్గీయులు పోటాపోటీగా సవాళ్లు విసురుకొన్నారు. సర్పంచి సహనం కోల్పోయి అనుచితంగా ప్రవర్తించారు. దీంతో తాము పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు రాజంపేట పార్లమెంటు పద్మశాలి సాధికార సమితి అధ్యక్షుడు ఆలూరి వెంకటసుబ్బయ్య తెలిపారు.

మట్టి అక్రమ రవాణాపై చర్యలేవి?

కమలాపురం, న్యూస్‌టుడే: మండలంలోని నల్లలింగాయపల్లె గుట్ట నుంచి పది రోజులుగా కొందరు అక్రమార్కులు ఎలాంటి అనుమతులు లేకుండా గుట్టను తవ్వి యథేచ్ఛగా మట్టిని తర లిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. రెవెన్యూ సిబ్బంది పరిశీలించినా నేటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదని వాపోయారు. ఈ విషయమై తహసీల్దార్ శివరామిరెడ్డిని వివరణ కోరగా వెంటనే అక్కడకెళ్లి గ్రావెల్ తరలించకుండా అడ్డుకుని చర్యలు తీసుకుంటామన్నారు.

రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు ఎంపిక

వేంపల్లె, న్యూస్‌టుడే: రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు వేంపల్లె శ్రీచైతన్య ఉన్నతపాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. అండర్-14 విభాగంలో పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థులు, అండర్-17 విభాగంలో అయిదుగురు ఎంపికయ్యారు. వారిని పాఠశాల కరస్పాండెంట్ చక్రపాణిరెడ్డి, పీఈటీలు సుందర్‌రెడ్డి, కృష్ణప్రసాద్‌లు అభినందించారు.



ఎంపికైన విద్యార్థులతో కరస్పాండెంట్ చక్రపాణిరెడ్డి

మృతుడి వివరాలు లభ్యం

సిద్దవటం, న్యూస్‌టుడే : సిద్దవటం శివారులోని ఏపీఎస్పీ పద కొండో బెటాలియన్ సమీపంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమా దంలో మృతి చెందిన వ్యక్తి వివరాలను పోలీసులు గుర్తించారు. కడ పలోని సరోజినీనగర్‌కు చెందిన మునెయ్య (45) అనే వ్యక్తి కడప పారిశ్రామికవాడలోని ఏపీ బేవరీస్ కార్పొరేషన్‌లో హమాలీగా పని చేసేవారు. సిద్దవటం మండలం పి.కొత్తపల్లెలోని తన బంధువుల వద్దకు వచ్చేందుకు సోమవారం ద్విచక్రవాహనంపై బయలుదేరారు. బెటాలియన్ సమీపంలోని ప్రధాన రహదారి వద్దకు రాగానే పక్కన ఉన్న కల్వర్టుకు ఢీకొని మృతి చెందారని వివరించారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

వేంపల్లె, న్యూస్‌టుడే: ఎన్నికల సమయంలో ప్రజలకిచ్చిన హామీలన్నింటినీ కూటమి ప్రభుత్వం నెరవేరుస్తుందని తెదేపా రాష్ట్ర పొలిట్‌బ్యూరోస భ్యుడు శ్రీనివాసరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ, తెదేపా పులివెందుల నియోజకవర్గ బాధ్యుడు బీటెక్ రవి పేర్కొన్నారు. మండలంలోని నందిపల్లెలో మంగళవారం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. పార్టీ పరిశీలకుడిగా వచ్చిన ఎమ్మెల్సీ బీటీ నాయుడు కూటమిప్రభుత్వ వందరోజుల పాలనలో జరిగిన అభివృద్ధి, నెరవేర్చిన హామీలగురించి ప్రజలకు వివరించారు. వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్ర బాబు ప్రజాసంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్నారన్నారు. జిల్లా ఉపాధ్యక్షుడు నంది పల్లె రామగంగిరెడ్డి, తెదేపా కన్వీనర్ రామమునిరెడి, ఉపాధ్యక్షుడు పసుపులేటి వీర భద్ర, భాజపా జిల్లా ఉపాధ్యక్షురాలు సుష్మ, షబ్బీర్, బాలస్వామిరెడ్డి, జగన్, రజనీ కాంత్‌రెడ్డి, ఆర్వీరమేష్‌బాబు, ఎద్దుల శేషారెడ్డి, వీరుడు, తదితరులు పాల్గొన్నారు.



నందిపల్లెలో బీటెక్ రవి, శ్రీనివాసరెడ్డిలను సత్కరిస్తున్న నాయకులు

కృష్ణారావుకు 'ఉత్తమ ఉపాధ్యాయ విశిష్టత' పురస్కారం

వైవీయూ (కడప), న్యూస్‌టుడే : యోగివేమన విశ్వవిద్యాలయంలోని రసాయన శాస్త్ర విభాగంలో ఆచార్యులుగా విధులు నిర్వహిస్తున్న ఆచార్య కేఎస్‌వీ.కృష్ణారావు హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఉమ్మడి తెలుగు రాష్ట్రాల ఉత్తమ ఉపాధ్యాయ 'విశిష్ట ప్రతిభా పురస్కారం-2024' అందుకున్నారు. ట్రస్ట్ ఛైర్మన్ విశ్రాంత డీజీపి డాక్టర్ పూర్ణచంద్రారావు, ఇటిక్యాల వీరయ్య ప్రదానం చేశారు. ఈ సందర్భంగా వైవీయూ వీసీ ఆచార్య కె.కృష్ణారెడ్డి, రిజిస్ట్రార్ ఎస్.రఘునాథరెడ్డి, వైస్ ప్రిన్సిపల్ పుత్తా పద్మ, అధ్యాపకులు ప్రత్యేకంగా అభినందించారు.

● విద్యా, పరిశోధనా రంగాల్లో కృష్ణారావు సేవలు, కృషి పరిగణనలోనికి తీసుకుని పురస్కారం ప్రదానం చేశారు. ఆయన వైవీయూలో 'పాలిమర్ బయోమెటీ డిజైన్ అండ్ సింథసిస్' పరిశోధనా బృందానికి నాయకత్వం వహిస్తున్నారు.



కేఎస్‌వీ కృష్ణారావును సత్కరిస్తున్న సంస్థ ప్రతినిధులు

నగరంలో యువతి హల్‌చల్

కడప, నేరవార్తలు, న్యూస్‌టుడే : మానసిక స్థితి సరిగ్గా లేని యువతి మంగళవారం కడప నగరంలో హల్‌చల్ చేసింది. సీకే.దిన్నె సమీపంలో నివాసం ఉంటున్న 20 ఏళ్ల యువతికి కొంతకాలంగా మానసిక పరిస్థితి సరిగ్గా లేదు. మంగళవారం ఆమె ఆటోలో కడపకు వచ్చారు. ట్రంక్ రోడ్డులోని కైలాస్ ప్రింటింగ్ ప్రెస్ వద్ద కొద్ది సేపు గందరగోళం చేశారు. అప్సర కూడలి వద్దకు రాగానే అక్కడ దాదాపు గంట పాటు రోడ్డుపై నానా రభస చేశారు. రోడ్డుపై నిలబడి గందర గోళం చేస్తుండడంతో ట్రాఫిక్ స్తంభించింది. స్థానికులు చిన్నచౌకు పోలీసులకు సమాచారమిచ్చారు. వారు రాగానే యువతిని అక్కడే ఉన్న బియ్యం దుకాణంలోకి పంపించి షెట్టర్ వేసేశారు. చిన్నచౌకు హెడ్‌కానిస్టేబుల్ చౌరవ తీసుకుని యువతిని ప్రభుత్వ మానసిక వైద్యశాలకు పంపించారు.

ఆలయ భూముల కబ్జాదారులపై చర్యలకు డిమాండు

వేంపల్లె, న్యూస్‌టుడే: వేంపల్లె ఆర్టీసీ బస్టాండు వెనుకనున్న వృషభాచలేశ్వర దేవస్థానానికి సంబంధించి రూ.కోట్ల విలువైన స్థలం ఆక్రమణకు గురైందని కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలని భాజపా జిల్లా ప్రధాన కార్యదర్శి గాలిహరిప్రసాద్ డిమాండు చేశారు. ఆలయ ఈవో విశ్వనాథరెడ్డితో మంగళవారం కలిసి సదరు స్థలాన్ని పరిశీలించారు.

ఆధ్యాత్మికత వైపు అడుగులేయాలి

అరవిందనగర్ (కడప), న్యూస్‌టుడే : యోగివేమన విశ్వవిద్యాలయ సమీపంలో కొత్తగా నిర్మించిన మసీదును పెద్దదర్గా పీఠాధిపతి హజరత్ ఆరీఫుల్లా హుసేనీ మంగళవారం ప్రారంభించారు. సంఘం గ్రూప్స్ ఛైర్మన్ నసీరుద్దీన్ మసీదు నిర్మించారు. ఈ సందర్భంగా పీఠాధిపతి మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మికత వైపు అడుగులు వేయాలన్నారు. తెదేపా నాయకుడు అమీర్‌బాబు, జేకే యూత్ అధ్యక్షుడు ఖాదర్‌బాషా, సంఘ సేవకుడు సలావుద్దీన్ పాల్గొన్నారు.



మసీదు ప్రారంభోత్సవంలో పాల్గొన్న హజరత్ ఆరీఫుల్లా హుసేనీ, అమీర్‌బాబు తదితరులు

దసరా ఉత్సవాల విజయవంతానికి పిలుపు

మారుతీనగర్ : గడ్డిబజార్‌లోని కామకోటి కళాంబదేవి సమేత సోమసుందరేశ్వరస్వామి ఆలయంలో అక్టోబరు 3వ తేదీ నుంచి జరిగే శరన్నవరాత్రి ఉత్సవాలను విజయవంతం చేయాలని ఆలయ ప్రధాన అర్చకుడు చంద్రమౌళిశర్మ పేర్కొన్నారు. ఆలయంలో మంగళవారం దసరా మహోత్సవాల కరపత్రాలను విడుదల చేసి మాట్లాడారు. ప్రతి రోజూ ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలతో పాటు సాయంత్రం విశేష అలంకరణలు ఉంటాయన్నారు.

మాదకద్రవ్యాలతో జీవితాలు బుగ్గి

వైవీయూ (కడప): విద్యార్థులు జ్ఞానసముపార్జనకు కృషి చేసి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ సీనియర్ సివిల్ జడ్జి బాబా ఫక్రుద్దీన్ సూచించారు. 'మాదకద్రవ్యాలు-నిర్మూలన' పక్షోత్సవాల ముగింపు కార్యక్రమాన్ని మంగళవారం వైవీయూలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు మత్తు పదార్థాల జోలికి వెళ్లకూడదన్నారు. గంజాయి తదితర మత్తు పదార్థాలు వినియోగిస్తే మూడేళ్ల జైలు, రూ.లక్ష జరిమానా విధిస్తారని గుర్తు చేశారు. కార్యక్రమంలో వీసీ ఆచార్య కె.కృష్ణారెడ్డి, ప్రిన్సిపల్ ఎస్.రఘునాథరెడ్డి, ఎన్‌వైకే యూత్ ఆఫీసర్ కె.మణికంఠ, డాక్టర్ వెంకట్రామ్, యూనియన్ బ్యాంక్ రీజనల్ హెడ్ లక్ష్మీ తులసి, తదితరులు పాల్గొన్నారు.

ఏపీ-తెలంగాణ కల్నల్‌తో మాజీ సైనికుల భేటీ

కడప, చిన్నచౌకు: ఏపీ-తెలంగాణ సబ్ ఏరియాకు చెందిన కల్నల్ ప్రదీప్ సింగ్‌సాబ్ మంగళవారం కడప మృత్యుంజయకుంటలోని సైనిక సంక్షేమ కార్యాలయానికి వచ్చారు. ఈ సందర్భంగా డిఫెన్స్ మాజీ సైనికుల సంఘం గౌరవాధ్యక్షుడు నారాయణరెడ్డి, అధ్యక్షుడు బాలవీరారెడ్డి తదితరులు ఆయనను కలిసి వినతిపత్రం అందజేశారు. కల్నల్ మాట్లాడుతూ.. అక్టోబరులో కడపలో జరిగే సైనిక ర్యాలీకి రానున్నానని, అప్పుడు సమస్యలు పరిష్కరిస్తామన్నారు. మాజీ సైనికులు నరసింహులు, సుమిత్రా, సహదేవరెడ్డి పాల్గొన్నారు.

నగరాభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక



కరపత్రాలు ప్రదర్శిస్తున్న ఎమ్మెల్యే మాధవి, పక్కన అదనపు కమిషనర్ రాకేష్

నగరపాలక న్యూస్‌టుడే : కడప నియోజకవర్గ అభివృద్ధిపై నగరపాలక సంస్థ కార్యాలయంలో మంగళవారం ఎమ్మెల్యే మాధవి సమీక్ష సమావేశం నిర్వహించారు. నగరపాలక ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాల వివరాలు అడిగి తెలుసుకున్నారు. పనులు పూర్తి చేయడంలో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రణాళిక విభాగంలో గత అయిదేళ్లలో యథేచ్ఛగా అక్రమ నిర్మాణాలు, అక్రమ లేఅవుట్లు కొనసాగించారని బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. బుగ్గవంక సుందరీకరణ, భూగర్భ మురుగు నీటిపారుదల వ్యవస్థ, తాగునీటి పనులకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు వివరించారు. పనుల పురోగతిపై సంబంధిత అధికారులతో చర్చించి పూర్తి చేసేందుకు ప్రణాళిక రూపిందిస్తామన్నారు. టిడ్కో గృహ సముదాయాల్లో అన్ని వసతులు కల్పించి చర్యలు తీసుకుంటామన్నారు. త్వరలో సీఎం చంద్రబాబు కడపకు వస్తున్నారన్నారు. అనంతరం వైకాపా 28వ డివిజన్ కార్పొరేటరు తెదేపాలో చేరిన నేపథ్యంలో మరికొందరు కార్పొరేటర్లు తమ పార్టీలో చేరే అవకాశం ఉందన్నారు. నేరచరిత్ర లేని వారిని మాత్రమే పార్టీలో చేర్చుకుంటామన్నారు. కార్యక్రమంలో తెదేపా పొలిట్‌బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి, కమిషనర్ నందన్, అదనపు కమిషనర్ రాకేశ్ చంద్ర తదితరులు పాల్గొన్నారు.

నగరంలో విస్తృత పర్యటన...

అరవిందనగర్ (కడప) : నగరంలోని పలు ప్రాంతాల్లో ఎమ్మెల్యే మాధవి మంగళవారం విస్తృతంగా పర్యటించారు. శంకరాపురం, కొండాయపల్లె, చిన్నచౌక్ తదితర ప్రాంతాల్లో తెల్లవారుజామున కురిసిన వర్షానికి కాలువలు పొంగి నీరు వీధుల్లోకి చేరింది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే మాధవి, అదనపు కమిషనర్ రాకేష్ ఆయా ప్రాంతాల్లో పర్యటించి స్థానికులను పరామర్శించారు. కాలువల్లో పేరుకుపోయిన చెత్తచెదారాన్ని తొలగించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. తెదేపా నాయకులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

● స్వర్ణాంధ్ర-2047 కార్యక్రమంలో భాగంగా కడప నగరపాలక సంస్థ ఈ నెల 25వ తేదీన నిర్వహించనున్న ర్యాలీ, మొక్కలు నాటే కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను ఎమ్మెల్యే మాధవి ఆవిష్కరించారు.

ప్రాయశ్చిత్త దీక్షకు మద్దతు

వీరపునాయునిపల్లె, న్యూస్‌టుడే: ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ చేపట్టిన ప్రాయశ్చిత్త దీక్షకు సంఘీభావంగా మంగళవారం అనిమెల సంగమేశ్వర దేవాలయంలో సనాతన ధర్మపరిరక్షణ జనసేన పార్టీ జిల్లా కోఆర్డినేటర్ సుంకర శ్రీనివాస్ దీక్ష చేపట్టారు. తిరుమల లడ్డూ ప్రసాదంలో కల్తీని నిరసిస్తూ చేపట్టిన దీక్షకు కమలాపురం ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యరెడ్డి మద్దతు ప్రకటించారు. నాయకులు వేణుగోపాల్‌రెడ్డి, నాగేంద్ర, శేషురాయల్, రెడ్డిప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.



సంగమేశ్వరాలయంలో దీక్షచేస్తున్న సుంకర శ్రీనివాస్‌కు మద్దతు ప్రకటిస్తున్న ఎమ్మెల్యే పుత్తాకృష్ణచైతన్యరెడ్డి

జిల్లాస్థాయి ఎస్‌జీఎఫ్ పోటీలు ప్రారంభం

కడప క్రీడలు: జిల్లా స్థాయి ఎస్‌జీఎఫ్ పోటీలు మంగళవారం ప్రారంభమయ్యాయి. కడప నగరంలోని డీఎస్ఏ ఇండోర్ స్టేడియంలో అండర్-14, 17 బాలబాలికల రెజ్లింగ్, కరాటే విభాగంలో జరిగిన ఎంపిక పోటీల్లో జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యదర్శి జి.అరుణకుమారి పాల్గొని క్రీడాకారులను పరిచయం చేసుకుని పోటీలు ప్రారంభించారు. జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులు రాష్ట్రస్థాయిలో రాణించి జిల్లా ఖ్యాతిని చాటాలన్నారు.

తిరుపతి సర్కిల్ అటవీశాఖలో బదిలీలు

జీవకోన(తిరుపతి), న్యూస్‌టుడే: తిరుపతి సర్కిల్ అటవీశాఖ పరిధిలో డీఎఫ్‌వో, సబ్ డీఎఫ్, కార్యాలయ ఉద్యోగుల బదిలీలు జరిగాయి. తిరుపతి ఫ్లయింగ్ స్క్వాడ్ డీఎఫ్‌వో శివకుమార్ వైఎస్సార్ జిల్లా ఫ్లయింగ్ స్క్వాడ్ డీఎఫ్‌వోగా బదిలీ కాగా ఆయన స్థానంలో ప్రకాశం జిల్లా డీఎఫ్‌వోగా పనిచేస్తున్న జి.శ్రీనివాసులును నియమించారు. పీలేరు ఫ్లయింగ్ స్క్వాడ్ డీఎఫ్‌వోగా కడప ఫ్లయింగ్ స్క్వాడ్ డీఎఫ్‌వోగా విధులు నిర్వహిస్తున్న గురుప్రభాకర్ నియమితులయ్యారు.

బాధితులకు ఆర్థిక సాయం

మారుతీనగర్ : నగరంలో రెండు రోజుల పాటు కురిసిన వర్షానికి శంకరాపురం, కొండాయపల్లె ప్రాంతాల్లోని పలు ఇళ్లలోకి నీరు చేరాయి. దీంతో జనసేన జిల్లా నాయకుడు తుంగ రమణయ్య మంగళవారం ఆయా ప్రాంతాలను పరిశీలించి బాధిత కుటుంబాలకు బాసటగా ఉంటానని భరోసా ఇచ్చారు. అనంతరం వారికి ఆర్థికసాయం అందించారు.



బాధిత కుటుంబానికి నగదు అందజేస్తున్న తుంగ రమణయ్య

ఎక్సైజ్ శాఖలో బదిలీలు

కడప నేరవార్తలు : ఎక్సైజ్ శాఖలో పలువురు అధికారులను బదిలీ చేస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఏలూరు విజిలెన్స్‌లో అసిస్టెంట్ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న చంద్రశేఖర్‌రెడ్డి, విశాఖపట్నం డిప్యూటీ కమిషనర్ జయరాజును కడపకు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

సేవా కార్యక్రమాలలో ముందుండాలి

బిల్టప్, కడప : కులమతాలకతీతంగా ప్రతి ఒక్కరూ సేవా కార్యక్రమాలు చేపట్టాలని ప్రముఖులు పేర్కొన్నారు. నగరంలోని ఎన్టీఆర్ కూడలి, రవి థియేటర్ వద్ద మంగళవారం వైకాపా నాయకులు దేవిరెడ్డి ఆదిత్య, మౌలా ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. మాజీ ఉపముఖ్యమంత్రి అంజాద్ బాషా, మేయర్ సురేష్‌బాబు, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించండి

వేముల, న్యూస్‌టుడే: విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని తెదేపా రాష్ట్ర ఉపాధ్యక్షుడు పార్థసారథిరెడ్డి తెలిపారు. స్థానిక కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాన్ని మంగళవారం ఆయన తనిఖీ చేశారు. విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. సమస్యలుంటే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ప్రత్యేకాధికారి శారదకు సూచించారు.



విద్యుత్తుశాఖ ఈఈగా హరిసేవ్యానాయక్ బాధ్యతల స్వీకరణ

కడప భాగ్యనగర్ కాలనీ, న్యూస్‌టుడే : ఏపీ దక్షిణ ప్రాంత విద్యుత్తు సంస్థ కడప డివిజన్ ఈఈగా హరిసేవ్యానాయక్ మంగళవారం ఆయన కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. విద్యుత్తుభవన్‌లో సాంకేతిక విభాగంలో ఈఈగా పనిచేస్తున్న ఆయనను కడప డివిజన్‌కు బదిలీ చేశారు. గత నెలాఖరున అప్పటి ఈఈ నరసింహప్రసాద్ ఉద్యోగవిరమణ చేయడంతో అప్పట్లో అదనపు బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుతం రెగ్యులరుగా నియమించారు. ఆయనతో పాటు డీఈలనూ బదిలీ చేశారు. కడప విద్యుత్తు భవన్‌లోని సాంకేతిక విభాగంలో డీఈగా పనిచేసే రమేష్‌రెడ్డిని కన్‌స్ట్రక్షన్ విభాగానికి, కర్నూలు నుంచి వచ్చిన మోహన్‌కుమార్‌ను విద్యుత్తుభవన్ సాంకేతిక విభాగానికి, కడప డివిజన్‌లో గ్రామీణ-1లో పనిచేసే కృష్ణదేవను విద్యుత్తుభవన్ శిక్షణావిభాగానికి, శిక్షణాకేంద్రంలో ఉన్న నాగశేషారెడ్డిని కడప సెక్షన్-1కు, సెక్షన్-1లో పనిచేసే నాగమునిస్వామిని గ్రామీణ-1కు బదిలీ చేశారు. వీరంతా విధుల్లో చేరారు.

మోస్తరు వర్షం... వీధులు జలమయం

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే : జిల్లాలో రెండు రోజులుగా ఓ మోస్తారు వర్షం కురుస్తోంది. కడప నగరంలో ఉదయం వేళ వర్షం కురుస్తుండటంతో పలు వీధులు నీట మునిగాయి. ఎర్రముక్కపల్లె, శంకరాపురం, ఎన్జీవో కాలనీ అప్సర రోడ్డు, ఫక్కీరుపల్లి తదితర ప్రాంతాల్లోని రోడ్లపై నీరు నిలిచింది. అత్యధికంగా పెండ్లిమర్రిలో 73.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదుకాగా జమ్మలమడుగులో 50.6, సీకేదిన్నెలో 48.4, కడపలో 43.2, సిద్దవటంలో 35.2, అట్లూరులో 28.2, మైలవరంలో 25.4, ఒంటిమిట్టలో 23.8, ప్రొద్దుటూరులో 16.6, మైదుకూరులో 12.4, ఖాజీపేటలో 11.8, చెన్నూరులో 11.2 మి.మీ వర్షపాతం నమోదైందని అధికారులు తెలిపారు.



ఎర్రముక్కపల్లెలోని ఓ వీధిలో నిలిచిన వాననీరు

